
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 8 జనవరి 2025





ఉపాధిలో.. పశుగ్రాసం సాగు

- రైతులు, పోషకులకు ప్రభుత్వం ఊతం
- నూరు శాతం రాయితీతో పథకం అమలు
- గరిష్ఠంగా అరెకరంలో సాగుకు ప్రోత్సాహం
- లబ్ధిదారుల ఎంపికలో అధికంగా రాజకీయ జోక్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతులు, పశుపోషకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే మినీ గోకులాల పథకం కింద షెడ్ల నిర్మాణాలను చేపట్టారు. చిన్న.. సన్నకారు రైతుల కోసం కొత్తగా పశుగ్రాస సాగు పథకాన్ని ప్రవేశపెట్టింది. పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం ఆర్థికంగా ఊతం ఇస్తోంది. గ్రాసం పెంపకం పథకానికి ఉపాధి హామీ నిధులు వెచ్చిస్తున్నారు. ఈ పథకాన్ని నూరు శాతం రాయితీతో అమలు చేస్తున్నారు. గరిష్ఠంగా అర ఎకరంలో పశుగ్రాసం పెంచుకునేందుకు ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తోంది. రైతుల్లో ఎక్కువ మంది వ్యవసాయానికి తోడుగా పాడిని చేపడుతుంటారు. గేదెలు.. ఆవులు పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పశుగ్రాసానికి ఇప్పటి వరకు పెద్దగా కొరత లేదు. వేసవిలో గ్రాసం కొరత తలెత్తే పరిస్థితులు ఉంటాయన్న అంచనా. ఈ పరిస్థితుల్లో నీటి ఆధారం ఉన్న రైతులు ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. తద్వారా పచ్చి మేతను పాడి పశువులకు అందించొచ్చు. ఒక్కో మండలానికి 35 నుంచి 45 ఎకరాల వరకు సాగుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. వీరికి ఖచ్చితంగా ఉపాధి జాబ్ కార్డు కలిగి ఉండాలి. అర్హులైనవారు సమీపంలోని పశువైద్యులు.. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు పొలానికి సంబంధించిన 1బీ, జాబ్ కార్డు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం నకలు కాపీలను జత చేయాలి. గ్రామ సభ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులు పశుగ్రాసం సాగుకు అర్హులు.

నిధుల కేటాయింపు ఇలా..

పది సెంట్లలో పశుగ్రాసాల పెంపకానికి కూలి ఖర్చు కింద రూ.3 వేలు, సామగ్రి ఖర్చుల కింద విత్తనం కొనుగోలుకు రూ.3,599, మొత్తంగా రూ.6,599 చెల్లి స్తారు. 50 సెంట్లలో పెంపకా నికి వేతనం కింద రూ.15 వేలు, విత్తన ఖర్చు లకు రూ.17,992 అందజేస్తారు. ఉపాధి పథకం అధికారులు, పశువైద్యులు ధ్రువీకరణ చేసిన అనంతరం రైతులకు బిల్లులు చెల్లిస్తారు.

జిల్లాకు వెయ్యి ఎకరాలు..

ఒక్కొక్క జిల్లాకు వెయ్యి ఎకరాల్లో ప్రశు గ్రాసం పెంపకం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో ఒక్కొక్క జిల్లాలో వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చిన్న.. సన్న కారు రైతులు గ్రాసం పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో రైతుల నుంచి దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలోనే వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం అధికంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. పశువులు లేని రైతులు కూడా ఈ పథకం కింద దరఖాస్తులు ఇస్తున్నారన్న విమర్శ లున్నాయి. పశువుల పెంపకంపై ఆధారపడి జీవించే రైతులకు ఈ పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు. రైతులు విస్తృత ప్రయోజనాల కోసం ప్రవేశ పెట్టిన పశుగ్రాస పథకంపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేనిపక్షంలో అర్హులకు అన్యాయం జరగడంతో పాటు పథకం లక్ష్యాలు నీరుగారిపోయే ప్రమాదం ఉంది.

100 రోజుల ఉపాధి హామీ
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం
ఆంధ్రప్రదేశ్

ఆ.. చేద్దాంలే

- సచివాలయాల్లో నిర్లక్ష్య ధోరణి
- నత్తనడకన సాగుతోన్న పరిశ్రమల సర్వే
- ప్రభుత్వ ఆదేశాలపై ఉద్యోగుల అలసత్వం
- సామాజిక పింఛన్ల పంపిణీలోనూ అదే తీరు
- ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలన్నా పట్టించుకోని వైనం
- తనిఖీల్లో పరిస్థితి చూసి బిత్తరపోతున్న ఉన్నతాధికారులు
- అడిగినంత నగదు ఇస్తే ఏ సర్టిఫికెట్ అయినా జారీ చేస్తోన్న ఉద్యోగులు



ప్రత్తిపాడు మండలం యనమదల సచివాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల సీట్లు (పాతచిత్రం)

అలక్ష్యం. 'ప్రభుత్వ లెక్కల ప్రకారం గుంటూరు జిల్లాలో 10326 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో ఎన్ని ఉనికిలో ఉన్నాయో తెలియదు. ఆ లెక్క తేల్చేందుకు ప్రభుత్వం సర్వే ఆరంభించింది. సచివాలయ సిబ్బంది ఈ సర్వేపై ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో సదరు సర్వే నత్తకంటే నిదానంగా సాగుతోంది. రోజువారీ నివేదికలో జిల్లా వెనుకబడే ఉంది.'

అబద్ధం.. 'పెన్షన్ల పంపిణీ రోజున జిల్లా అధికారులు తక్కెళ్లపాడు వెళ్లారు. అక్కడ పెన్షన్లు అందిస్తున్న సచివాలయ ఉద్యోగి ఓ చోట కూర్చొని అందరినీ అక్కడకు పిలిపించి పంపిణీ చేస్తున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తిని కూడా అదేవిధంగా పిలిపించి పెన్షన్ ఇచ్చారు. జిల్లా అధికారి ఇదేమిటని నిలదీస్తే ఆ వ్యక్తి ఇల్లు ఇక్కడే అని ఉద్యోగి సమాధానం ఇచ్చారు. ఏది చూద్దాం పదా అని జిల్లా అధికారి పెన్షన్ దారుడు ఇంటికి వెళ్తే అది సుమారు అర కిలోమీటరు పైనే ఉంది. అంత దూరం నుంచి కాళ్లు ఈడ్చుకుంటూ పెన్షన్ కోసం రావాల్సి వచ్చింది.'

అలసత్వం ఇటీవల ప్రత్తిపాడు మండలం యనమదలలో సిబ్బంది సచివాలయం తలుపులు తీసేసి వెళ్లిపోయారు. సచివాలయంలో విలువైన రికార్డులు, కంప్యూటర్లు, ప్రింటర్లు అనేకం ఉన్నా వాటిని గాలికి వదిలేశారు. పనుల కోసం వచ్చిన వారు సచివాలయంలో అన్ని సీట్లు ఖాళీగా ఉండటం.. ఎంతసేపు వేచి ఉన్నా ఒక్కరు కూడా రాకపోవడంతో గ్రామస్తులు విస్తుపోవాల్సి వచ్చింది. తలుపులు బార్లా తీసి వెళ్లిపోవడంలో ఉద్యోగుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.



సకాలంలో విధులకు హాజరు కావాలి.. పనుల కోసం వచ్చే వారిని తిప్పించుకోకూడదు.. సామాజిక పింఛన్లు ఇళ్ల వద్దే పంపిణీ చేయాలి.. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలపై ఎప్పటికప్పుడు స్పందించాలి... అని ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు సూచిస్తోంది. అయితే ప్రతీ అంశంలోనూ సచివాలయ ఉద్యోగుల్లో నిర్లక్ష్యం.. అలక్ష్యం.. అశ్రద్ధ.. అవినీతి.. కనిపిస్తోంది. కొన్ని సచివాలయాల పరిధిలో ఉద్యోగులు 11 గంటలకు కూడా రావడంలేదని.. ఏదైనా పనిపై వెళ్తే సరైన సమాధానం ఉండటంలేదని.. ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తనిఖీల సమయంలోనూ ఉద్యోగుల సమయపాలన.. పనులపై నిర్లక్ష్యం.. ఆదేశాలపై అలక్ష్యం.. తేటతెల్లమవుతోంది. కొన్ని సార్లు నిర్లక్ష్యంగా ఉండే ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నా.. వారి పనితీరులో మాత్రం మార్పు ఉండటంలేదని ఉన్నతాధికారులే వాపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కొందరు సచివాలయ ఉద్యోగుల పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

గుంటూరు సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏ పని చెప్పినా సిబ్బంది సాచివేత ధోరణి.. ప్రభుత్వ ఆదేశాలను కూడా పట్టించుకోవడంలేదు.. ఇదీ పలు సచివాలయాల్లోని ఉద్యోగుల తీరని కొందరు జిల్లా అధికారుల అభిప్రాయం. కొందరు సచివాలయ ఉద్యోగులు పనుల కోసం వచ్చే వారిని మామూళ్ల కోసం పీడిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేసినా తమకు ఏమీ కాదన్న ధోరణిలో కొందరు ఉన్నారు. పరిశ్రమల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉండగా.. దానిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యధోరణిలో ఉన్నారు. ఈ సర్వే అంశంలోనే సచివాలయ ఉద్యోగుల పనితీరు తెలుస్తోందని పలువురు ఉన్నతాధికారులు వాపోతున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎక్కడ.. ఎన్ని ఉనికిలో ఉన్నాయో తెలిస్తే వాటికి మరిన్ని ప్రోత్సాహకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సర్వే పూర్తి అయితేనే పరిశ్రమల లెక్క తెలుస్తోంది. అందుకు సంబంధించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రానికి వస్తాయి. గతంలో ఒకసారి ఈ సర్వే ఆరంభించి మధ్య లోనే నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ సర్వే ఆరంభించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో జరుగుతున్న పరిశ్రమల సర్వే చాలా నిదానంగా జరుగుతుంది. సర్వేకి సంబంధించి ఉదాహరణకు ఈ నెల 4న నివేదికను పరిశీలిస్తే.. గుంటూరు జిల్లాలో 10326 పరిశ్రమలు ఉండగా, ఆ రోజు వరకు కేవలం 2591 మాత్రమే సర్వే పూర్తి చేశారు. ఆ తర్వాత రోజు నుంచి ఆ సంఖ్య దాటడం లేదు. కొన్ని సచివాలయాల్లో రోజుకు 20 కంటే ఎక్కువ సర్వే జరగడం లేదు. ఈ నివేదికలు చూసి జిల్లా అధికారులు సైతం నిత్యం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఉద్యోగుల తీరులో మార్పు రావడంలేదు.

పెన్షన్ పంపిణీని మార్చేశారు

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ విధానాన్ని కొందరు సచివాలయ ఉద్యోగులు మార్చేశారు. ప్రతి ఇంటికి ఉద్యోగులు వెళ్లి పెన్షన్ అందజేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే కొందరు ఉద్యోగులు ఒక చోట కూర్చొని లబ్ధిదారులను పిలిపించి ఇస్తున్నారు. జిల్లా అధికారుల ఆకస్మిక తనిఖీలో ఇదే విషయాలు వెలుగు చూస్తున్నాయి. చివరకు ముఖ్యమంత్రి కూడా ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇస్తుంటే కొందరు సిబ్బంది ఇలా ఎందుకు చేస్తున్నారన్నది జవాబు దొరకని ప్రశ్నగా ఉంది. ప్రభుత్వం నుంచి వస్తున్న ఆదేశాల్లో లోపాలను వెతికి వివాదాలు సృష్టిస్తున్న సచివాలయ ఉద్యోగులను (మిగతా 8వ పేజీలో)

చీకట్లో ఇసుక దందా

- నదిలోకి ఎక్స్‌కవేటర్లు.. యథేచ్ఛగా తవ్వకం
- పోలీసులు, విజిలెన్స్‌కు తెలిసినా తెలియనట్లే
- లారీలకు లారీలు తరలిపోతున్నా కళ్లప్పగింత
- అదేమంటే.. ఓ నేత పేరు చెప్పి దందా
- అక్రమాలున్నా సక్రమమని అధికారుల కితాబు

తెనాలి, కొల్లిపర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిలో ఒక్కోచోట మూడు నుంచి ఐదు వరకు ఎక్స్‌కవేటర్లు, వందల కొద్దీ లారీలు. తెల్లవార్లూ విరామం లేకుండా ఎక్స్‌కవేటర్లు తవ్విపోసేస్తుంటే, లారీలకు లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. ఇదంతా బిల్లులూ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది. యంత్రాలు లేకుండా మనుషులతో తవ్వి, ట్రాక్టర్లతో ఒడ్డుకుతోలి, అక్కడి నుంచి ఎక్స్‌కవేటర్‌తో లారీలకు ఇసుక నింపాలి. ఆ ప్రకారం కాంట్రాక్ట్ దక్కించుకున్న వారు నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలను నదిలోకే దింపేసి ఇసుక తవ్వేసి తరలిస్తున్నారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, మున్నంగి రీచ్‌ల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వస్తే మూడు రోజుల తర్వాత వెళ్లిన విజిలెన్స్, మైనింగ్ అధికారులు ఒక్క రీచ్‌లో కూడా యంత్రాలు లేవని, అంతా కూలీలతో సక్రమంగానే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయంటూ కితాబివ్వటం విశేషం. ఆ తర్వాత కూడా యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరిగితే, అది చాలదన్నట్టు అర్థరాత్రి యంత్రాలతో ఇసుకను తోడేసి తరలిస్తున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రకటించినా, మధ్యలో ఇసుక తోడేళ్లు చేరిపోయి ఉచితాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని కాసులు వెనకేసుకుంటున్నారు. ప్రకాశం బ్యారేజి దిగువన అర్థరాత్రి ఇసుక దందా యథేచ్ఛగా సాగుతుంటే, ఇదంతా తెలిసినా పోలీసులు, విజిలెన్స్ అధికారులు మాత్రం ఏమీ జరగనట్లు అటువైపే చూడకపోవటం విశేషం. ఒకవేళ వెళ్లినా.. అబ్బే అదేమీలేదంటూ పైపైన చూసేసి వచ్చేయడం వెనుక మర్మమేమిటనేది అంతుబట్టని విషయం. కూటమి ప్రభుత్వంలో ఓ నేత పేరుచెప్పి, ఆయన అనుమతితోనే ఇవన్నీ చేస్తున్నామని కొందరు బరితెగిస్తున్నారు. గతంలో దారుణంగా ఇసుక తవ్వుకుపోతే, పట్టించుకోకుండా మా ప్రభుత్వం వచ్చాక రీచ్‌ల్లోకి వస్తారా అంటూ మండల స్థాయి అధికారులపై అక్రమార్కులు విరుచుకుపడుతున్నారని తనిఖీలకు వెళ్లిన అధికారులు వాపోతున్నారు. జరుగుతున్న అక్రమాలను పైస్థాయి అధికారులకు వివరించినా పట్టించుకోవడంలేదని, పలుమార్లు చెబితే తిరిగి తమకే వారు హెచ్చరికలు చేస్తున్నారని, అందుకే తాము పట్టించుకోవడం లేదని రెవెన్యూ శాఖకు చెందిన ఓ అధికారి బహిరంగంగానే వాపోవడం చూస్తే ఇక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఓ నాయకుడి పేరుచెప్పి ఇసుకాసురులు దందా కొనసాస్తున్నారు.. అక్రమ తవ్వకాలు ఆపాలి.. భూగర్భ జలాలు అడుగంటిపోకుండా కాపాడాలి.. అని మంత్రి మనోహర్‌ను కలిసి కోరాలని స్థానికులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దారుణాలతో నష్టపోయామని, కూటమి ప్రభుత్వం వస్తే, అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఆశిస్తే, అది జరగకపోగా, మరింతగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారంటూ బొమ్మువానిపాలెం గ్రామానికి చెందిన ఓ రైతు తెలిపారు. తవ్వకాలు ఆపకుంటే ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని స్థానికులు చెబుతున్నారు. ఈ తరహా అక్రమ దందా బొమ్మువానిపాలెంతో పాటు మున్నంగి, కొల్లిపర, అత్తలూరివారిపాలెం, పెదకొండూరు, గుండిమెడ, ప్రాంతాల్లోని రీచ్‌ల్లోనూ సాగుతుందనేది బహిరంగ రహస్యం.

బరితెగింపు..

కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం ఇసుక రీచ్‌లో మంగళవారం రాత్రి ఎక్స్‌కవేటర్‌లతో ఇసుక తవ్వేస్తూ బరితెగిస్తున్నారు. నదిలోకి యంత్రాలు వెళ్లడమే తప్పు. పైగా వాటితో ఇసుక తవ్వకంతో పాటు లారీలకు లారీల్లో ఇసుకను నింపేస్తున్నారు. మంగళవారం రాత్రి 7 గంటల నుంచి నదిలోకి యంత్రాలు తీసుకెళ్లి ఇసుక తవ్వి తరలిస్తున్న వీడియోలు 'ఆంధ్రజ్యోతి'కి చిక్కాయి. జీపీఎస్ మ్యాప్ కెమేరాతో లోకేషన్ వచ్చేలా ఫొటోలు కూడా లభించాయి. గతంలోలా తవ్వకాలు జరిపింది అక్కడ కాదని, ఎక్కడో, ఎప్పుడో తీసిన ఫొటోలు అంటూ కొట్టిపారేసే అవకాశం అధికారులకు అవకాశం లేదు. దీంతో వీటిని చూసి అధికారులు తవ్వకాలు నిజమని ఒప్పుకుంటారో! లేక కాంట్రాక్టర్లకే వంత పాడతారో చూడాలి. మైనింగ్ అధికారులు గుర్తించిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఇసుకను తోడేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ధనుర్మాస వ్రత దీక్షలతో పుణ్యఫలం

8

మంత్రి నారా లోకేశ్



మంగళగిరి శ్రీశైలనగర్ బాపూజీ విద్యాలయంలో చినజీయర్ స్వామితో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్, చిత్రంలో టీటీడీ పాలకమండలి సభ్యులు తమ్మిశెట్టి జానకీదేవి



పందెం కోళ్లకు భలే గిరాకీ!

- సంక్రాంతి బరికి సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

ముక్కోటి ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

సదస్సులతో సమస్యలకు చెక్ పడేనా?

- నేటితో ముగియనున్న రెవెన్యూ సదస్సులు
- ప్రజల నుంచి భారీగా అభ్యంతరాల స్వీకరణ
- వచ్చిన అర్జీల్లో 80 శాతం మ్యుటేషన్ వివాదాలే
- జిల్లాలో 4,132 దరఖాస్తులకు 752 పరిష్కారం



కొల్లిపర: బొమ్మువానిపాలెం రెవెన్యూ సదస్సులో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా భూములను చెరబట్టడమే కాకుండా రాజకీయ జోక్యంతో వేలాది ఎకరాలను వివాదంలో పడేసి ఎంతోమందిని బాధితులుగా మార్చారు. వారి గోడు వినకపోగా తిరిగి వారిపైనే కేసులు బనాయించి భూ మాఫియాకు వైసీపీ నేతలు అండగా నిలిచారన్న విమర్శలు, ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. గత ప్రభుత్వంలో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడమే కాకుండా వాటిని వైసీపీ నేతలే హస్తగతం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఈ పరంపరలోనే కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో భూవివాదాలకు పరిష్కారం దొరుకుతుందనే ఆశతో పెద్ద సంఖ్యలో బాధితులు అధికారులను ఆశ్రయించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఎక్కువగా భూవివాదాలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ప్రజాదర్బార్లలో సైతం ఎక్కువగా భూ బాధితులే ఉన్నారు. ఈ క్రమంలో ఆయా సమస్యలకు చెక్ పెట్టడంపై కూటమి ప్రభుత్వం ఆరంభం నుంచే దృష్టి సారించింది. రెవెన్యూ గ్రామాల ప్రామాణికంగా సదస్సులు నిర్వహించి భూ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిసెంబరు 6 నుంచి వాటికి శ్రీకారం చుట్టగా జనవరి 8 బుధవారంతో సదస్సులు ముగియనున్నాయి. ఒక్కో మండలంలో రోజుకు ఒక గ్రామంలో సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామంలోని భూ బాధితుల సమస్యలతో మళ్లీ అధికారులను ఆశ్రయించకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఒక్కో గ్రామంలో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకుని సదస్సులపై బాధితుల నుంచి అర్జీల స్వీకరణ.. కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తూ వచ్చారు. ఈ సదస్సులతో అయినా భూ సమస్యలకు చెక్ పడాలని బాధితులు ఎదురు చూస్తున్నారు. దాదాపుగా నెలకుపైగా జరిగిన రెవెన్యూ సదస్సుల్లో పెద్దసంఖ్యలో మ్యుటేషన్‌కు సంబంధించి వివాదేలపైనే అర్జీలు వచ్చాయి. రికార్డుల్లో ఉండాల్సిన భూమి కంటే తక్కువ విస్తీర్ణం ఉందని పలువురు నివేదించగా ఇలాంటి ఫిర్యాదుల విషయంలో ఉన్నతస్థాయిలో సర్వే నిర్వహించి తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ముందుగా ఇరుపార్టీలకు నోటీసులు జారీ చేసి సిబ్బంది విచారణ చేపడతారని తర్వాతే వీటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుందని అధికారులు చెప్తున్నారు. 20 శాతం పైగా దరఖాస్తుల్లో కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ, ఎఫ్‌లైన్ పిటిషన్లు వంటివి ఉన్నాయి. వాటిని సత్వరమే పరిష్కరించడానికి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో కూడా రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు అందాయి. జిల్లాలో 235 గ్రామాలకు మంగళవారం సాయంత్రం వరకు 197 గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహించారు. ఇప్పటివరకు 4,132 అర్జీలు అందగా వాటిల్లో 752 పరిష్కరించినట్లు డీఆర్వో ఖాజావలి తెలిపారు. మ్యుటేషన్లకు సంబంధించిన వివాదాలను సివిల్ కోర్టులే పరిష్కరించాల్సి ఉందని చెప్పారు.

సోమరాజుపాలెం వివాదంపై 18న కలెక్టర్ నిర్ణయం

తెనాలి రూరల్ మండలం సోమరాజుపాలేనికి చెందిన కేశన పిచ్చయ్య అనే వృద్ధుడు తన సమస్యని రెండేళ్లుగా పరిష్కరించకుండా జాప్యం చేస్తున్నందుకు చొక్కా తీసి సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో నిరసన తెలిపారు. దీనిపై కలెక్టర్ నాగలక్ష్మి స్పందించి రెవెన్యూ అధికారుల ద్వారా వివరాలు తెప్పించుకున్నారు. పిచ్చయ్య తన ఆస్తిని మేనకోడలకు గిఫ్టు డీడ్ చేశారు. అయితే ఆయన ఆలనపాలన పట్టించుకోకపోవడంతో తొలుత తెనాలి సబ్ కలెక్టర్‌ని ఆశ్రయించారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండేళ్లుగా కలెక్టరేట్ గ్రీవియన్స్‌కి వస్తున్నారు. గిఫ్టు డీడ్‌ని రద్దు చేయాల్సిందిగా ఆయన కోరుతున్నారు. దీనిపై ఈ నెల 18న విచారించి కలెక్టర్ చర్య తీసుకుంటారని డీఆర్వో తెలిపారు.

నేడు జాతికి అంకితం



చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిలో చిలకలూరిపేట వద్ద సుమారు రూ.వెయ్యి కోట్లతో నిర్మించిన 16.4 కిలోమీటర్ల ఆరు లైన్ల బైపాస్ రోడ్డును ప్రధాని మోదీ బుధవారం జాతికి అంకితం చేయనున్నారు. విశాఖపట్నంలో జరిగే పలు కార్యక్రమాలలో భాగంగా ప్రధాని వర్చువల్‌గా ఈ రోడ్డును ప్రారంభిస్తారు.

-చిలకలూరిపేట

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

- కాకినాడ - వికారాబాద్ మార్గంలో రాకపోకలు

6

నడికుడి మార్గంలో రైళ్ల రాకపోకల్లో ఆలస్యం

జాతీయ యువజన ఉత్సవాలకు ఏఎన్‌యూ విద్యార్థులు

సంక్రాంతికి అదనపు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు అదనంగా ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07205-కాకినాడ టౌన్ - వికారాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 9వ తేదీన రాత్రి 9 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు, 10వ తేదీన సాయంత్రం 5 గంటలకు వికారాబాద్ - శ్రీకాకుళం రోడ్డు (07207) రైలు బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయి. ఈ నెల 11న మధ్యాహ్నం 2.45గంటలకు శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి (07208) రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు గమ్యస్థానం చేరుతుందని తెలిపారు.

హుబ్లీ వరకే షాలిమార్ - వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్

వారంలో నాలుగు రోజుల పాటు గుంటూరు మీదుగా ప్రయాణించే షాలిమార్ - వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్ (18047) రైలు ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు హుబ్లీ వరకే ప్రయాణించనుంది. ఈ విషయాన్ని సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు.

నడికుడి మార్గంలో రైళ్ల రాకపోకల్లో ఆలస్యం

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నడికుడి మార్గంలో మంగళవారం వేకువ జామున పలు రైళ్లు నాలుగైదు గంటల ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. సోమవారం అర్ధరాత్రి సమయంలో సికింద్రాబాద్ వైపు నుంచి వస్తున్న ఖాళీ గూడ్స్ రైలుకు సంబంధించిన ఒక భోగీ పొందుగల - నడికుడి సెక్షన్‌లో పట్టాలు తప్పడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో రైళ్ల రాకపోకలపై ప్రభావం పడింది. గుంటూరు వైపు నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరిన రైలు నంబరు 17255 నరసపూర్-లింగంపల్లి, చెన్నై సెంట్రల్ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్(12603)లను మార్గ మధ్యంలో నిలిపివేశారు. పట్టాలు తప్పిన భోగీని తిరిగి ట్రాక్ పైకి ఎక్కించి క్లియర్ చేసేందుకు దాదాపు మూడు గంటల సమయం పట్టింది. ఈ కారణంగా ఆ రెండు రైళ్లు సికింద్రాబాద్‌కు ఐదు గంటల ఆలస్యంగా చేరాయి. భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), తిరుపతి - లింగంపల్లి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ (12733)లను విజయవాడ నుంచి దారి మళ్లించడంతో అవి కూడా ఐదు గంటలకు పైగా ఆలస్యంగా సికింద్రాబాద్‌కు చేరాయి. రేపల్లె - వికారాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్ (17626) రెండున్నర గంటల ఆలస్యంగా, సికింద్రాబాద్ వైపు నుంచి గుంటూరుకు బయలుదేరిన కాచిగూడ-రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ (17625) నాలుగున్నర గంటల ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరాయి. లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ (17256) దాదాపుగా ఐదు గంటల ఆలస్యంగా గుంటూరుకు చేరుకుని ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లింది. నాగర్‌సోల్ - నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌ని సికింద్రాబాద్ నుంచే కాజీపేట మార్గంలోకి దారి మళ్లించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో రైళ్ల వేగాన్ని 30 కిలోమీటర్లకు నియంత్రిస్తూ రైల్వే శాఖ కాషన్ ఆర్డర్‌ని జారీ చేసింది. ఈ సంఘటనపై ఉన్నతస్థాయి విచారణని రైల్వే అధికారులు ప్రారంభించారు. గతంలోనూ విష్ణుపురం సమీపంలో ఇలాంటి సంఘటనే జరిగింది. ఈ నేపథ్యంలో నడికుడి - మిర్యాలగూడ - నల్గొండ మధ్యన ట్రాక్ పటిష్టతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విడదల రజినిపై కేసులో 'సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ)నిబంధనలు అనుసరించాలి'

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన చేపట్టిన మాజీ మంత్రి విడదల రజినీ, ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రజలకు అసౌకర్యం కలిగించారని పేర్కొంటూ నమోదు చేసిన కేసులో ఆమెపై సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ) ప్రకారం నడచుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్ చార్జీల విషయంలో నిరసన చేపట్టి, ట్రాఫిక్ అంతరాయం కలిగించడంతోపాటు ప్రజలకు అసౌకర్యం కలిగించారని పేర్కొంటూ చిలకలూరిపేటకి చెందిన పిల్లి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు రజినిపై చిలకలూరిపేట పట్టణ పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు వచ్చింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ స్పందిస్తూ పిటిషనర్‌కు సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ)కింద నోటీసులు ఇస్తామన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 567.00 అడుగులు ఉంది. ఇది 249.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8022 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,597 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 50,886 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 50,886 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 38.71 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

హెల్మెట్ ధరిస్తే సురక్షితంగా గమ్యస్థానానికి



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం. బబిత తదితరులు

- రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, పోలీసుల సూచన

తుళ్లూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం ద్వారా ద్విచక్రవాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎమ్ బబిత సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన ప్రాధాన్యతను వివరించడం కోసం మంగళవారం తుళ్ళూరు పోలీసులతో కలిసి హైకోర్టు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బబిత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పాట్రన్-ఇన్-చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరి సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినటు వివరించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహ నాలు నడపటం మోటారు వాహన చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరమని తెలిపారు. ఇకపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి శిక్షలు కఠినంగా అమలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ సేవల కమిటీ కార్యదర్శి జీ మాలతి మాట్లాడుతూ చాలామంది ద్విచక్రవాహన దారులు తమ హెల్మెట్‌ను వాహనంపై ఉంచి నడుపుతున్నారని, వాహనాల తనిఖీల సమయంలో కంగారులో హెల్మెట్ ధరించే క్రమంలో కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. తుళ్ళూరు డీఎస్పీ టీ మురళీకృష్ణ మాట్లాడుతూ రూ. 10 వేల విలువ చేసే సెల్ ఫోన్ కొనుగోలు చేస్తేనే దానికి స్క్రీన్ గార్డ్ వేస్తున్నారని, అంతకన్నా విలువైన ప్రాణాలు రక్షించుకోవడం కోసం కనీసం హెల్మెట్ ధరించడంలేదని అన్నారు. ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. ఇక నుంచి శుభకార్యాలకు, పుట్టిన రోజు సంద ర్భంగా ఇతరులకు గిఫ్ట్‌గా హెల్మెట్ ఇవ్వడం చేస్తే అది అనేక మంది ప్రాణా లను రక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం కొంతమంది హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వ ర్యంలో ఉచితంగా హెల్మెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డా హెచ్ అమర రంగేశ్వరరావు, తుళ్ళూరు ట్రాఫిక్ సీఐ బీ కోటేశ్వరరావు, అసిస్టెంట్ సెక్రెటరీ ఎస్ జెజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ, ఎన్ఐపీహెచ్ఎం అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య),జనవరి 7(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్ మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మంగళవారం ఈ విషయాన్ని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, జాయింట్ డైరక్టర్ డాక్టర్ విధు కేపీలతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సం బంధించిన పత్రాలను మార్చుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఎన్ఈపీ 2020లో పొందుపరిచిన మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీస్ (ఎమ్ఈఆర్‌యూ) కాన్సె ప్ట్‌ను, అకడమిక్ ప్రోగ్రామ్స్‌ను, కరిక్యులమ్ డిజైన్‌ను చేస్తా మన్నారు. అంతేకాకుండా ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, ఫ్యాకల్టీ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్ పీరియన్స్, పేటెంట్స్, ప్రాజెక్ట్‌లు, ఉమ్మడిగా పరిశోధనలు చేయ డంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చని అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డెరక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవ గాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉంద న్నారు. అధ్యాపకులను, విద్యార్థులను సరి కొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో శిక్షణ ఇవ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, డీన్స్ పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

- దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో ఘటన
- రూ. 30 లక్షల విలువైన బంగారం, వెండి చోరీ



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

దాచేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయి. పండుగలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లే కుటుంబాలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దొంగతనాలతో లక్షల రూపాయల సొమ్ము కోల్పోయిన బాధితులు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దాచేపల్లి మండలం దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో నివాసముంటున్న జీఎం శంకర నారాయణరెడ్డి కుటుంబసభ్యులు తమ స్వగ్రామం రాజమండ్రి వెళ్లారు. ఆ ఇంటికి దగ్గరలో నివాసముంటున్న మరో అధికారి వీర ప్రకాషరావు కూడా తన కుటుంబ సభ్యులతో షిర్డీ వెళ్లారు. ఈ విషయాన్ని పసిగట్టిన గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడి బీరువాలో దాచిన బంగారం, వెండి సామాన్లు అపహరించారు. శంకరనారాయణ రెడ్డి ఇంట్లో 190 గ్రాములు, వీర ప్రకాసరావు ఇంట్లో 170 గ్రాములు బంగారం చోరీ జరిగింది. ఆయా కుటుంబాల వారు తిరిగి ఇళ్లకు చేరుకున్న తర్వాత చోరీ జరిగినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాచేపల్లి ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో గృహాలకు తాళాలు వేసి తమ సొంత ఊళ్లకు వెళ్లే వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తగిన భద్రత తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని వివరించారు. గతంలో కూడా దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో లక్షల రూపాయల విలువైన బంగారం, నగదు దొంగతనం జరిగింది. ఇంత వరకు ఆయా చోరీలకు సంబంధించిన విషయాల్లో ఎటువంటి పురోగతి లేదని స్థానికులు, బాధితులు విమర్శిస్తున్నారు.

దారిదోపిడీ కేసులో నిందితుల అరెస్టు



దారి దోపిడీ కేసులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు, సీఐ శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, జనవరి 07 (ఆంధ్రజ్యోతి) : దారిదోపిడి కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వివరించారు. పట్టణంలోని ధనలక్ష్మీ రైస్‌మిల్లు వద్ద లారీలో ఊక నింపుకుని దుగ్గిరాల కాఫీ ఫ్యాక్టరీకి వెళుతుండగా, బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద లారీని ఇద్దరు వ్యక్తులు బారికేడ్ అడ్డం పెట్టి ఆపారు. మరో ఇద్దరు వచ్చి లారీ డ్రైవర్ రావూరి వాసుతోపాటు ముగ్గురు కూలీలను కత్తులతో దాడి చేసి గాయపరిచి, వారి వద్ద ఉన్న రూ. 1500, సెల్ ఫోన్‌లు దొంగిలించారు. దీంతో, రావూరి వాసు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం గాలించి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులలో పట్టణంలోని రైలుపేటకు చెందిన షేక్ మదార్, అంబేద్కర్ నగర్‌కు చెందిన చేగూడి ఆనందబాబు, రైలుపేటకు చెందిన మొహమ్మద్ ఇక్బాల్, శాంతినగర్‌కు చెందిన షేక్ బాషీద్‌లు ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. చెడు వ్యసనాలు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని వారు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రైళ్ళల్లో మొబైల్ ఫోన్‌లు దొంగతనం చేస్తుంటారని, వాటిని అమ్ముకొని జల్సాలు చేస్తుంటారని చెప్పారు. వీరిలో 12 వారిపై చీరాల, బాపట్ల, తెనాలి జీఆర్‌పీ పోలీసు స్టేషన్లలో, బాపట్లటౌన్, వేటపాలెం పోలీసుస్టేషన్, చీరాల 1వ పట్టణ పోలీసుస్టేషన్, పొన్నూరు టౌన్ పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నారు. చోరీ చేసిన ఫోన్లను నిందితులు పట్టణంలోని మొబైల్‌షాపు వద్ద విక్రయించేదుకు వచ్చిన సమయంలో రూరల్ సీఐ కే శ్రీనివాసరావు, ఎస్సై ఎం.శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేసినటు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

ఏపీ సీపీడీపీఎల్ సీఎండీ పర్యటన

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్‌సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పటాన్‌శెట్టి రవి ఈ నెల 9న గుంటూరు పర్యటనకు రానున్నారు. ఈ మేరకు విజయవాడలోని సీఎండీ కార్యాలయ అధికారులు గుంటూరు సర్కిల్ కార్యాలయానికి సమాచారం అందించారు. సంగడిగుంటలో ఉన్న విద్యుత్‌భవన్‌కు రవి వెళతారు.

72,819 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 76,310 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 72,819 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్య దర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 55,385 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	8000	13500
నంబరు. 5	10000	14000	నంబరు. 5	8000	13000
273	9000	11500	273	-	-
341	7500	14500	341	12000	12000
4884	9000	11500	4884	-	-
సూపర్ 10	10500	10500	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7200	16500	తేజ	7500	15500
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	8000	12000
దేవనూరుడీలక్స్	9000	14500	దేవనూరుడీలక్స్	9500	9500
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	4000	9000



ప్రసంగిస్తున్న మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

షెడ్యూలు కులాల అభ్యున్నతికి కృషి చేయాలి

తాడేపల్లి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): షెడ్యూలు కులాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు.ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు కులాల సహకార, ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఎండీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. డైరెక్టర్లు కూడా చిత్తశుద్ధితో తమ విధులు నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ పాల్గొన్నారు.



యువజనోత్సవాలకు ఎంపికైన విద్యార్థులతో వర్సిటీ అధికారులు

జాతీయ యువజన ఉత్సవాలకు ఏఎన్‌యూ విద్యార్థులు

పెదకాకాని, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లోని విద్యార్థులు మార్చి 5వ తేదీన నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో జరిగే జాతీయ యువజన ఉత్సవ పోటీలలో పాల్గొననున్నట్లు వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య కే. గంగాధరరావు తెలిపారు. గత ఏడాది డిసెంబరు 26 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన సౌత్ జోన్ యువజన ఉత్సవాల పోటీలలో విశ్వవిద్యాలయ విద్యార్థులు ఆరు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు విజేతలను వీసి అభినందించారు. సౌత్ జోన్ స్థాయిలో వర్సిటీ పేరు ప్రతిష్ఠలను పెంచిన విద్యార్థులు, జాతీయ స్థాయిలో కూడా ఇనుమడింపజేయాలని కోరారు. ఈ సందర్భంగా యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్, డాక్టర్ రమీ బేగంలను అభినందించారు. యువజన ఉత్సవాలలో వర్సిటీ విద్యార్థులు స్పాట్ ఫోటోగ్రఫీ, మెహందీ, మైమ్, ఇన్ స్టాలేషన్, కార్టూనింగ్ విభాగాల్లో పతకాలు సాధించినట్లు యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కే. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం అందజేశారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు

గుంటూరు సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని రకాల చేనేత వస్త్రములపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఇవ్వనున్నట్లు ఆప్కో వాణిజ్య అధికారి డీ వెంకటేశ్వర్లు తెలిపారు. చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పి ంచేందుకు, అధిక విక్రయాల కోసం ఆప్కో వస్త్రాలపై తగ్గింపును ప్రకటించినట్లు తెలిపారు. మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి మంగళగిరి చేనేత చీరలు, బెడ్‌షీట్స్, లుంగీస్, టవల్స్ రెడీమేడ్ వస్త్రములు అందుబాటులో ఉంటాయని అన్నారు. అన్ని ఆప్కో విక్రయశాలలతో పాటు, ఆప్కో హ్యాండ్లూమ్స్.కామ్ అమెజాన్, ఫ్లిప్కార్ట్ వంటి ఆన్‌లైన్ సంస్థలలో వస్త్రాలు కొను గోలు చేయవచ్చునని తెలిపారు.

రూ. 60 లక్షలు ఇవ్వని వారిపై చీటింగ్ కేసు

ప్రత్తిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకుని ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న వారిపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాతమల్లాయపాలెంకి చెందిన సూరగాని గోపిరెడ్డికి గుంటూరుకు చెందిన గాలం శ్రీనివాసరావు, గాలం కార్తీక్, గాలం రేవతిలతో గత ఏడు సంవత్సరాలుగా పరిచయం ఉంది. ఈ క్రమంలో వ్యాపారం నిమిత్తం 2022 నుంచి వివిధ దఫాలుగా గోపిరెడ్డి వద్ద నుంచి రూ. 60 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే, ఈ సొమ్మును గోపిరెడ్డి తన బంధువుల వద్ద నుంచి తీసుకుని వారికి ఇచ్చారు. కొంత కాలంగా తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని అడుగుతుండగా వారు తప్పించుకు తిరుగుతున్నారు. గోపిరెడ్డి అప్పుతీసుకున్న వారి నుంచి ఒత్తిడి రావడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు తన వద్ద అప్పు తీసుకున్న ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి



గంజనబోయిన లింగయ్య (ఫైల్)

ఈపూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలోకి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరులో మంగళవారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఈపూరుకి చెందిన గంజనబోయిన లింగయ్య (55) అంగలూరు మేజర్ కాలువలో నీటిని తీసుకునేందుకు యత్నిస్తుండగా కాలుజారి నీటిలో పడ్డాడు. నీటి ఉధృతికి కొద్ది దూరం కొట్టుకుపోయాడు. కాలువలో ఆయన మృత దేహాన్ని గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి మృతి



మృతుడు సత్యనారాయణ

మాచవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మాచవరంలో మంగళ వారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన అంబటి సత్యనారాయణ(40) పొలానికి నీరు పెట్టేందుకు వెళ్ళాడు. ప్రమాద వశాత్తు కాలువలో పడిపోవటంతో నీటిలో మునిగి ఊపిరి ఆడక చని పోయినట్టు తెలిపారు. అక్కడ ఉన్న వారు చూసి ఈ సమాచారాన్ని సత్య నారాయణ బంధువులకు చేరవేశారు. సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించే సరికే చనిపోయి ఉన్నాడు. ఎస్ఐ సతీష్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పిడుగురాళ్ళ వైద్యశాలకు తరలించినట్టు తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

యూపీహెచ్‌సీల మెరిట్ జాబితా విడుదల

గుంటూరు మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎల్‌జీఎస్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాలకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టను జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ జాబితాలో పేర్లపై అభ్యంతరాలు ఉంటే వాటిని లిఖితపూర్వకంగా తగిన ఆధారాలతో జనవరి ఏడవ తేదీ నుంచి పదవ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

అంగన్‌వాడీలకు పదోన్నతి కల్పించాలి

గుంటూరు(తూర్పు), జనవరి 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు, హెల్పర్లకు తక్షణమే పదోన్నతి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ ఎండీ చిస్తీ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న రిలే దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ప్రారంభించిన వారు మాట్లాడుతూ పోస్టులు భర్తీ, పదోన్నతులు లేకపోవడంతో సెంటర్ నిర్వహణ లోపభూయిష్టంగా మారిందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అధికారులు జిల్లాలో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 18 నెలలు గడిచినా పోస్టులు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఈ దీక్షలలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏపీఎన్ కుమారి, పద్మ, జి రమణ, ఏ.కళ్యాణి, రమేష్ బాబు, వేముల దుర్గారావు, ఎన్ భావన్నారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనపై అభ్యంతరాల స్వీకరణ పొడిగింపు

గుంటూరు(విద్య), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7తో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిందని చెప్పారు. మరో 5 రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గుంటూరు(విద్య),జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుబాల మహిళా ప్రాంగణంలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన సీడీపీవోలు, సూపర్‌వైజర్స్‌కు నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. వెయ్యి రోజుల సంరక్షణ, తల్లి పాలివ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి తెలుసుకోవడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కొల్‌స్ట్రమ్ ప్రయోజనాలను, అనుబంధ పోషకాహార ప్రాముఖ్యతపై శిక్షణ అందించారు. అంతేకాకుండా 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషకాహారం సమతుల్య ఆహారం ప్రాముఖ్యత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి విద్యా, మహిళా, శిశు సంక్షేమశాఖాధికారి విజయలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మమత, న్యూట్రిషన్ లక్ష్మి నరసమ్మ, డాక్టర్ హరిత, నోడల్ అధికారి శ్రీవాణి, హేమలత భాస్కర్ పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గత యాభై ఏళ్లుగా అనేక విభాగాలలో ప్రజలకు సేవలు అందిస్తున్న స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకాలలో విధులు నిర్వహిస్తున్న స్కీమ్ వర్కర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. నిరసనలో పుప్పాల సత్యనారాయణ, రంగారెడ్డి, స్వరూపరాణి, భూషణకుమారి, ఉదయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా

గుంటూరు(తూర్పు), జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీ పద్మావతి కల్యాణమండపం వేదికగా పుష్య మాసం సందర్భంగా సర్వకార్య జయం హనుమాన్ చాలీసా 108 సార్లు పారాయణ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విశేష హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. చిలకలూరిపేట మండలం, ఈవూరిపాలెం భజన బృందం చేసిన పారాయణం ఆకట్టుకుంది. అనంతరం స్వామి వారికి 108 సువర్ణ అష్టదళ పద్మాలపూజను ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి, బృందం నిర్వహించారు. కార్యక్రమాల్ని భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు.

9న జాబ్ మేళా

గుంటూరు(విద్య), జనవరి 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు, తెనాలిలో ఈనెల 9న జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొండా సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాలలో, తెనాలిలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఈఈ కార్యాలయం ఆవరణ కేడబ్ల్యూ డివిజన్ ఇరిగేషన్ కార్యాలయంలో జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు. జాబ్‌మేళాకు పది, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన వారు అర్హులని, వయసు 18 నుంచి 35 సంవత్సరాల వరకు ఉండాలని సూచించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్, ఫొటోతో హాజరుకావాలన్నారు.

12 నుంచి జీఎంసీ సంక్రాంతి సంబరాలు

● బ్రోచర్‌ని ఆవిష్కరించిన కమిషనర్, ఎమ్మెల్యే మాధవి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి, అధికారులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు ఎన్టీఆర్ మున్సిపల్‌స్టేడియంలో నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంస్థల సహకారంతో సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవితో కలిసి మంగళవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం నూతన ఏడాది నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో 4 రోజుల పాటు సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఎన్టీఆర్ స్టేడియంలో ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సంక్రాంతి వేడుకలను జీఎంసీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా, మరో 5 ఏళ్ల పాటు మర్చిపోలేని విధంగా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. సంబరాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలకు 15వ తేదీ బహుమతులు అందిస్తామన్నారు. మీడియా ప్రతినిధులకు క్రికెట్, షటిల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

సంబరాల వివరాలు

● 12 వ తేదీ ఉదయం 9 నుండి 11 గంటల వరకు ముగ్గుల పోటీలు (ఆడవాళ్లకు మాత్రమే), మెహందీ (ఆడవాళ్లకు, పిల్లలకు).

● 13న సన్నాయి మేళం, భోగీ మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, ఫుడ్ స్టాల్స్ ప్రారంభం, భోగి పళ్ళు, టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, సాయంత్రం 5 నుంచి 10 గంటల వరకు తంబోలా, సాంప్రదాయ వస్త్ర పోటీలు(మహిళలు, చిన్న పిల్లలు), చెక్క భజన, కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ తదితర కార్యక్రమాలు జరుగుతాయి.

● 14వ తేదీ ఉదయం గంగిరెద్దుల విన్యాసాలు, ఎద్దుల ప్రదర్శన, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, కర్రసాము, సాయంత్రం 4 నుంచి 10 గంటల వరకు కోలాటం, స్టార్ మ్యూజికల్ నైట్, కాంతార యాక్ట్, జగలర్స్, ఎక్స్ ట్రా స్కిట్.

● 15వ తేదీ సాయంత్రం 3:30 నందు 10:30 గంటల వరకు గాలి పటాలు ఎగుర వేయుట, ఫ్యూజన్ డ్యాన్స్, ప్రాసమణి ప్రోగ్రాం, మ్యాజిక్ షో (ఇల్ యుజన్ షో), క్లాసికల్ డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్, వాసవి ఆర్కెస్ట్రా జరుగుతాయి.

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, కార్పొరేటర్లు ఈవరప్రసాద్, వి.శ్రీరామ్ ప్రసాద్, స్టేడియం మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్ పాల్గొన్నారు.

గుంటూరు వైసీపీ కార్పొరేటర్ సుబ్బారెడ్డికి హైకోర్టు బెయిల్

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయం పై దాడి కేసులో వైసీపీ కార్పొరేటర్ పి.సుబ్బారెడ్డి మంగళవారం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. చార్జ్‌షీట్ దాఖలు చేసేవరకు ప్రతీవారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం తీర్పు ఇచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై 2021 అక్టోబర్ 19న జరిగిన దాడి రోజు తాను నరసరావుపేటలోని మేనల్లుడి ప్రీ వెడ్డింగ్ వెడుకలో ఉన్నానని, పోలీసులు అక్రమంగా తనను ఈ కేసులో ఇరికించారని ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ కార్పొరేటర్ పి.సుబ్బారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా ఘటన జరిగిన రోజు పిటిషనర్ టీడీపీ కార్యాలయం వద్ద ఉన్నారని, అందుకు ఆధారాలు ఉన్నాయని సీఐడీ చెబుతుందని, తాను పెళ్లిలో ఉన్నానని పిటిషనర్ కోర్టుకు ఆధారాలు సమర్పించిన నేపథ్యంలో సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి కోర్టు ముందుకు రావాలని ఇరువైపుల న్యాయవాదులకు న్యాయస్థానం ఆదేశించింది. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు రాగా పోలీసులు తరఫున ఏపీపీ వాదనలు వినిపిస్తూ.. సీసీటీవీ ఫుటేజ్‌ను పిటిషనర్ తరఫు న్యాయవాదికి అందజేస్తే దర్యాప్తుకు ఆటంకం కలుగుతుందన్నారు. ఈ దశలో ఫుటేజ్‌ను బహిర్గతం చేయలేమన్నారు.

ప్రభుత్వాస్పత్రి సమాచార దర్శిని ఆవిష్కరణ



సాహో జీజీహెచ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రమణ యశస్వి, రామకోటేశ్వరరావు

గుంటూరు మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవల సంపూర్ణ వివరాలతో రూపొందించిన సమాచార దర్శిని సాహో జీజీహెచ్ పోస్టర్లను, పుస్తకాలను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, జింకానా అధ్యక్షుడు డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు (అమెరికా), నర్సింగ్ సూపరింటెండెంట్ జాయింట్ డైరెక్టర్ సుధారాణి తదితరులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి సంబంధించిన అన్ని విషయాలు సులభంగా రోగులకు అర్థమయ్యే విధంగా పొందుపర్చినట్లు తెలిపారు. ఈ సమాచార దర్శిని వల్ల రోగులు, వారి సహాయకులు ఇబ్బందులకు గురి కాకుండా సేవలు పొందవచ్చని ఆయన వివరించారు.

పేద క్రీడాకారులకు అండగా ఉండాలి : మాజీ ఎమ్మెల్యే సుభాని

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులను ప్రోత్సహించేలా అందరూ ముందుకు రావాలని పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాల సెక్ర టరీ కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ సుభాని పిలుపునిచ్చారు. ఆంధ్ర ముస్లిం కళా శాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న షేక్ సుభాని ఏషియన్స్ గేమ్స్‌కు ఎంపికవడం తో ఆయనకు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేసే క్రీడాకారులకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. ఆంధ్ర ముస్లిం కళాశాలలో విద్యార్థులు విద్య తో పాటుగా క్రీడల్లో కూడా అత్యుత్తమ ప్రతిభను చాటుతున్నారని ఆయన చెప్పారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థి షేక్ సుభాని ఏషియన్ గేమ్స్‌కు ఎంపికవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మహమ్మదీయ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు షేక్ రెహమాన్, కార్యవర్గ సభ్యులు సలహాదారుడు డాక్టర్ మస్తాన్‌వలి, ఆంధ్ర ముస్లిం కళాశాల ప్రిన్సిపాల్ షాహినా బేగం, పలువురు అధ్యాపకులు ఉన్నారు.

అంబటి మురళిని తక్షణమే అరెస్టు చేయాలి : కంచర్ల

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం నడిబొడ్డున పట్టాభిపురం మెయిన్ రోడ్డులో అనుమతులు లేని అక్రమ కట్టడాలను నిర్మించి అమాయక ప్రజలను మోసగించి ప్లాట్లు అమ్ముకొంటున్న అంబటి మురళిని వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూట్ మిల్లు స్థల సేకరణే అక్రమమని, జూట్ మిల్లు కార్మికులకు న్యాయం చేయకుండా అడ్డుపడి అక్రమ నిర్మాణాలు చేస్తున్న అంబటి మురళిపై చట్టబద్ధ చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రైల్వే శాఖ ఇచ్చిన ఎన్‌వోసీని రద్దు చేశాక కూడా నిర్మాణాలు కొనసాగించడం అక్రమమన్నారు. ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ లేకుండా నిర్మించుతున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనుమతులు లేని ప్లాట్లను కొన్నవాళ్లకు అంబటి మురళి వెంటనే డబ్బు వాపస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబటి మురళి నిర్మించిన గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్లలో ప్లాట్లు కొనవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బొబ్బిలి రామారావు, షేక్ ఫిరోజ్, పుల్లా సుందరంబాబు, బెల్లంకొండ సురేష్, ఆనంద్ పాల్గొన్నారు.

విదేశీ విద్యావకాశాలపై అవగాహన అవసరం

● వర్సిటీ ఫార్మసీ ప్రిన్సిపాల్ ఆచార్య ప్రమీలారాణి

గుంటూరు(విద్య), జనవరి 7(ఆంధ్రజ్యోతి): విదేశీ విద్యావకాశాలపై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన ఉండాలని ఆచార్య నాగార్జున వర్సిటీ ఫార్మసీ ప్రిన్సిపాల్ ఆచార్య ప్రమీలారాణి విజ్ఞప్తి చేశారు. వర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. వర్సిటీ ఫార్మసీ విభాగంలో ఇసిసిహెచ్‌వో ఓవర్సీస్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలు గురించి ఈసీసీహెచ్‌వో ఓవర్సీస్ చైర్మన్ డాక్టర్ నల్లమోతు రమేష్ వివరించారు. యూకే, యుఎస్ఏ, ఐర్లాండ్ దేశాలలో ఉన్న ఉన్నత విద్యా అవకాశాలు, అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. విదేశీ విద్యావకాశాలపై బ్రోచర్ ఆవిష్కరించారు.

భక్తి శ్రద్ధలతో శ్రీరాముని అభిషేకం

గుంటూరు (తూర్పు) జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతి నగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ మారుతి దేవాలయం ప్రాంగణంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల్లో మంగళవారం నాలుగవ రోజు స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. శ్రీమద్రామాయణ పారాయణలు జరిగాయి. సాయంత్రం నీరాజన మహా మంత్ర పుష్పాలతో స్వామివారికి దర్బారు సేవ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

12న సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జనవరి 7(ఆంధ్రజ్యోతి): మహతీ స్వరసుధ రజతోత్సవ సందర్భంగా ఈనెల 12వ తేదీన స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో అన్నమయ్య కళా వేదికపై అలనాటి పాటలతో 'సంగీత విభావరి' నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షురాలు పత్రి నిర్మల తెలిపారు. అంతేగాక రజతోత్సవ సందర్భగా ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు ప్రతి నెలా ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ, సినీనటుడు సంపూర్ణేష్‌బాబు తదితరులు

డ్రగ్స్, ర్యాష్ డ్రైవింగ్‌తో అనర్థాలే : ఎస్పీ

గుంటూరు(విద్య), జనవరి 7(ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులందరూ డ్రగ్స్‌కు, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, బైక్‌లపై ర్యాష్ డ్రైవింగ్ అనర్థాలకు కారణమ వుతుందని ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 'విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లా డుతూ కళాశాలలో ఉన్నప్పుడే భవిష్యత్తు గురించి ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. యువత తమకు నచ్చిన రంగాన్నే ఎంచుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు మాట్లాడుతూ జీవితంలో మనం ఎదుటివారితో మాట్లా డే మాటతీరు, ప్రవర్తనే సమాజంలో మన స్థాయిని నిర్ణయిస్తుందన్నారు. మనం ఇతరుల కు ఇచ్చే సంస్కారమే మనల్ని జీవితంలో ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుందన్నారు. విద్యార్థులందరూ కలలు కని వాటిని సాకారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుడివాడ జూని యర్ సబ్ రిజిస్ట్రార్ వీ.మణి చైతన్య, కళాశాల ప్రిన్సిపాల్ వీ అనురాధ, నిరుల ఇంజ నీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పాతూరి రాధిక తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రాష్ట్రంలో అడుగుపెట్టే నైతిక హక్కు ప్రధాని మోదీకి లేదు

● రాష్ట్రానికి అన్ని విధాలా ఎన్డీఏ ప్రభుత్వం అన్యాయం

● మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అడుగుపెట్టే నైతిక హక్కు ప్రధాని మోదీకి లేదని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి ధ్వజమెత్తారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా అన్యాయం చేసిన ప్రధాని మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలతో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. ప్రధాని మోదీ బుధవారం విశాఖ పర్య టనను నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని టైటా నిక్ సెంటర్ నుంచి హిమనీ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు నల్లజెండాలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తున్న నరేంద్ర మోదీ ఏ మొహం పెట్టుకొని ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా సాక్షాత్తు భారత రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించారని మండిపడ్డారు. తక్షణమే అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అవ్వకుండా కాపాడుతానని మాట్లాడిన పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ ముందుగా రాష్ట్ర ప్రజలకు విశాఖ స్టీల్ ప్లాంట్‌పై స్పష్టమైన హామీ ఇచ్చి రావాలన్నారు. గో బ్యాక్ మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగం శెట్టి ఈశ్వరరావు, అంబటి రత్తయ్య, షైలా కిరణ్, విజయ్, వెంకటేశ్వర్లు, మోషే పలువురు నాయకులున్నారు.



నగరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న మస్తాన్‌వలి, కాంగ్రెస్ నాయకులు

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

● మాజీ మంత్రి విడదల రజిని

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి విడదల రజిని డిమాండ్ చేశారు. గుంటూరులోని ఆమె నివాసంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి కనిపించటం లేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మార్పులు ఏమాత్రం సరికాదన్నారు. హైబ్రిడ్ మోడల్‌తో ఇన్సూరెన్స్ కంపెనీలకే లాభం తప్ప ప్రజలకు ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను 3257కు పెంచి 919 నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి 2300లకు పెంచారన్నారు. పథకంలో కవరేజ్ రూ.25 లక్షల వరకు పెంచటంతో పాటు అర్హతకు వార్షికాదాయాన్ని రూ.5 లక్షలకు పెంచటంతో రాష్ట్రంలో దాదాపు 1.5 కోట్ల కుటుంబాల్లో 95 శాతం ప్రజలు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించటంలో ఉదాసీనంగా వ్యవహరించటం తగదని ఆక్షేపించారు. ఆరోగ్యశ్రీని హైబ్రిడ్ మోడల్‌లోకి మార్చటం తగదని, ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని మార్చుకోకపోతే ప్రజల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోని పిల్లలు ఆస్తి హక్కుకి అర్హులుకారని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని విద్యావేత్త, విశ్లేషకులు సింగరయ్య సంతోషం వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు స్వాగతించదగినదని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో చూసేవారు లేక ఆకలితో, అనారోగ్యంతో అలమటించే వృద్ధుల సంఖ్య నానాటికి పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో మంది అభాగ్యులైన వృద్ధులు కుటుంబసభ్యుల చేతుల్లోనే భౌతికదాడులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆర్ నాయుడు, జనార్దన్‌రావు తదితరులున్నారు.



మార్నింగ్ వాక్‌లో స్థానికులను పలకరిస్తున్న ఎమ్మెల్యే నసీర్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి

ఆలపాటికి మద్దతుతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● బీఆర్ స్టేడియంలో ఎమ్మెల్యే, ఆలపాటి ప్రచారం

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఆలపాటికి మద్దతుగా నిలిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. బీఆర్ స్టేడియంలో మార్నింగ్ వాక్ చేస్తూ.. వాకర్స్ ఉపాధ్యాయులను పలకరిస్తూ కూటమి ప్రభుత్వం మద్దతు పొందిన మాజీ మంత్రి ఆలపాటి రాజా పోటీలో నిలుచుకున్నారు.. తప్పకుండా గెలిపించాలి' అని ఎమ్మెల్యే నసీర్ కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా పలకరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అటు అభివృద్ధి, ఇటు సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని వారు తెలియజేశారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- 2047 విజన్‌తో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజాను పెద్దల సభకు పంపించడం మనందరి బాధ్యతని నసీర్ చెప్పారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఆలపాటి రాజాకు మద్దతు తెలుపుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, యల్లావుల అశోక్, సజీల, వేములకొండ శ్రీనివాస్, సంకూరి శీను, జాగర్లమూడి శ్రీనివాస్, కోట పిచ్చిరెడ్డి, ముప్వ శైలజ, జమీర్, కొత్తూరు వెంకట్, చిలక వెంకటేశ్వర్లు, రియాజ్, వంగర ఏడుకొండలు, ఐలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ నియోజకవర్గంలో భారీగా అభివృద్ధి పనులు

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

● రూ.51.50 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చాక గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో భారీగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. 43వ డివిజన్ విద్యానగర్‌లో రూ.51.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, గత ప్రభుత్వం శివారు కాలనీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు గెలిచిన చోట్ల అభివృద్ధి పనులను పూర్తిగా ఆపేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు, జమ్ముల వీరాంజనేయులు, కొల్లి బాలకృష్ణ, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, పేరయ్య తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 29వ డివిజన్ భవానిపురంలో వారం రోజుల వ్యవధిలో 11 ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరిగాయని బాధితులు ఫిర్యాదు చేయడంతో ఆమె పోలీసులను విచారణకు ఆదేశించారు. పింఛన్లు, సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన వినతులే అత్యధికంగా రావడంతో వారికి సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే మాధవి హామీ ఇచ్చారు.

పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సీఎం సహాయ నిధి ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆపన్నులకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె పలువురు అనారోగ్య బాధితులకు రూ.1.36 లక్షల చెక్కులు అందజేశారు. పరిశీలకుడు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు. అనంతరం గుంటూరులోని హజరత్ కాలే మస్తాన్ వలి బాబా ఆవులియా 133 ఉరుసు ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే మాధవిని ధర్మకర్త రావి రామ్మోహన్‌రావు ఆహ్వానించారు.

'ఇంధన రంగంలో అవకాశాల'పై వీవీఐటీలో సదస్సు

పెదకాకాని, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించేందుకు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్'లో భాగంగా ఇంధన రంగంలో అవకాశాలపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా సిమెన్స్ ఎనర్జీ ఇండస్ట్రియల్ టర్బో మిషనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇంజనీరింగ్ (గ్యాస్ టర్బైన్స్) హెడ్ డాక్టర్ గిరిధర్ కుమార్ దిన్నే హాజరయ్యారు. ఈ సదస్సులో గిరిధర్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పురోగమనాలు, ప్రపంచ పర్యావరణ ఆందోళన కారణంగా ఇంధన రంగం గణనీయమైన మార్పులకు లోనవుతుందనీ, ఫలితంగా ఇంధన పరిశ్రమలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్యాస్ టర్బైన్ వ్యవస్థ నిర్వహణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, ఈఈఈ విభాగాధిపతి ఏవీ నరేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



డాక్టర్ గిరిధర్ కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీవీఐటీ అధ్యాపకులు

వైసీపీ ప్రజాప్రతినిధులు తీరు మార్చుకోవాలి : బీజేపీ

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన సాగించే క్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయమనంతో వ్యవహరించాలి తప్ప వ్యక్తిగతమైన దూషణలకు పోవడం మంచి సాంప్రదాయం కాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నేత బీ పాండురంగ విఠల్ మంగళవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న పరిణామాలను పరిశీలించినట్లయితే వైసీపీ ప్రజాప్రతినిధులు అధికారులను దూషించి, బెదిరించి పనులు చేయించాలనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. గత వైసీపీ పాలనలో అధికారులపై ఎలా పెత్తనం చలాయించారో ప్రజలందరికీ తెలుసుఅని, ఇకనైనా ప్రజలకు మేలు జరిగే విధంగా అధికారులతో పనులు చేయించే విధానం తెలుసుకుని ప్రజలకు మేలు చేయాలని సూచించారు. కార్పొరేషన్‌లో తలెత్తిన వివాదానికి వెంటనే తెరదించి ప్రజాపాలన కొనసాగించే పరిస్థితులను కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను తాను కోరుతున్నానన్నారు.



పందెం కోళ్లకు భలే గిరాకీ !


రసంగి


కోడిపుంజులకు శిక్షణ నిస్తున్న శిక్షకులు





సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ.. పందేలకు కోళ్లను సన్నద్ధం చేస్తున్నారు పందెంరాయుళ్ళు. ఇందుకోసం వివిధ రకాల పుంజులను సిద్ధం చేసుకుంటున్నారు. పండుగకు అయిదు నెలల ముందు నుంచే అన్ని జాతుల కోడిపుంజులను తీసుకువచ్చి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి కోడి పుంజులకు బలవర్ధక ఆహారమైన డ్రై ఫ్రూట్స్ తినిపిస్తూ పెంచుతున్నారు. అలాగే ఆయా పుంజులు బరిలో అన్నివిధాలా తట్టుకొని నిలిచి గెలవడం కోసం బలవర్ధకమైన ఆహారంతోపాటు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. దీంతో పందెం రాయుళ్లు సిద్ధమైన కోళ్లను రూ. లక్షలు పెట్టి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- సంక్రాంతి బరికి సిద్ధం చేస్తున్న నిర్వాహకులు
- డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక ఆహారం, శిక్షణ
- కుక్కుటి శాస్త్రం ద్వారా గెలుపోటములు
- లక్షలు పలుకుతున్న కోడి పుంజులు

రేపల్లె, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో నిర్వాహకులు పందె కోళ్లను సన్నద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో పుంజు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. తీర ప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో కొన్ని సంవత్సరాలుగా కోడిపందాలు నిర్వహిస్తున్నారు. ఈ పందాలకు తెలంగాణా రాష్ట్రం నుంచి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి పందెం రాయుళ్ళు తరలి వస్తారు. రానున్న సంక్రాంతికి చెరుకుపల్లిమండలం పూషడపువారిపాలెం, నగరం, రేపల్లె మండలం గుడ్డికాయలంకలో కోడిపందాలు వేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో వారం రోజులుగా తర్ఫీదులో భాగంగా పుంజులకు పందేలు నిర్వహిస్తున్నారు. అలాగే వాటిని సంక్రాంతి బరిలో నిలిపేందుకు గట్టి శిక్షణను ఇస్తున్నారు.

ప్రత్యేక ఆహారం, వ్యాయామం

నిత్యం ముగ్గురు శిక్షకులు పందెపు కోళ్ళ సంరక్షణ చూస్తుంటారు. ఉదయాన్నే 5 గంటల కల్లా కోడి పుంజులను బయటకు తీసి కాసేపు చల్లటి పైరు గాలి శ్వాస తీసుకునేలా చేసి అనంతరం చుట్టూ వలయంగా ఏర్పాటు చేసి కోడి పుంజులను దాంట్లోకి వదిలి పరుగెత్తిస్తారు. వాటికి పేరుకుపోయిన కొవ్వును బయటకు తీసి స్విమ్మింగ్ చేయిస్తారు. పుంజులు అలసిపోవటంతో పాలల్లో నానబెట్టిన బాదం పప్పు, పిస్తా పప్పు, ఖర్జూర, కిస్‌మిస్‌లను కోళ్ళకు పెట్టి సిరంజి ద్వారా పాలను పట్టిస్తారు. ఒక్కో పుంజుకు రోజుకు వంద నుండి రూ.700 వరకు ఖర్చు చేసి మానవుడి కంటే అతి సున్నితంగా పందెపు కోళ్ళను తయారు చేయటంలో వారు తీసుకునే జాగ్రత్తలు చూస్తే ఆశ్చర్యం చెందాల్సిందే. నిత్యం కోళ్లకు బలమైన ఆహారంతో పాటు వ్యాయామం చేయించి సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా, కోడి పందాలు ఎప్పుడు వేద్దామా అనే రీతిలో పుంజులను తయారు చేస్తారు.



కోడి పుంజుల్లోని రకాలు..

కోడి పుంజుల్లో తెల్ల నెమలి, కోడి నెమలి, గౌడ నెమలి, కాకి డేగ, నెమలి కక్కెర, నల్ల కక్కెర, రసంగి, గాజు కక్కురాయి, అబ్రాస్, ఎర్రడేగ వంటి జాతులు వుంటాయి. వీటిల్లో తెల్ల నెమలి, గౌడ నెమలి, రసంగి, అబ్రాస్ పుంజులు ఎంతటి పందానైన్నా సులువుగా నెగ్గుతాయి. పందానికి తయారయ్యే పుంజులకు రూ.50 వేల నుంచి లక్షరూపాయలకుపైనే ఖర్చు చేస్తారు. వీటికి బలమైన ఆహారంతోపాటు ప్రత్యేక శిక్షకుడిని పెట్టి శిక్షణ నివ్వటంతోపాటు పందెం కోడి తయారయ్యేలా చేస్తారు. ఈ కోళ్ళన్నీ పూర్తిస్థాయిలో పందానికి సిద్ధమైతే లక్ష రూపాయలు పైనే పలుకుతుందని శిక్షకులు చెబుతున్నారు.

కోడి పందాలకు కుక్కుటి శాస్త్రం..

కోడి పందాల్లో ప్రావీణ్యం వున్న వారు కుక్కుటి శాస్త్రాన్ని అనుసరిస్తారు. పందెం వేసే రోజున నక్షత్రాన్ని బట్టి తారాబలం చూసి కోడి రంగు, జాతిని ఎంపిక చేసి ఆరోజున ఏ పుంజుతో పందెం వేయాలో ఆ రంగు వున్న కోడి పుంజుతోనే పందాలు వేయటం జరుగుతుంది. 13వ తేదీ భోగి సందర్బంగా గౌడ నెమలి, నెమలికి చెందిన పుంజులు గెలుపొందుతాయని, 14వ తేదీ యాసర కాకిడేగలు, కాకి నెమలిలు, పసిమగల్ల కాకులు, కాకి డేగలకు చెందిన పుంజులు గెలుపొందుతాయి. 15వ తేదీ డేగలు, ఎర్రకాకి డేగలు గెలుపొందుతాయని కోడిపందాల్లో ప్రావీణ్యం వున్నవారు ఈ కుక్కుటి శాస్త్రం ఆధారంగా చెబుతున్నారు.

కాకి డేగ



నెమలి కక్కెర



నల్ల కక్కెర



గాజు కక్కెర



అబ్రాస్



ఎర్ర డేగ



కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో 196 మంది ఎంపిక

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతోన్న కానిస్టేబుళ్ళ దేహదారుఢ్య పరీక్షల్లో బుధ వారం 196 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. 315 మంది హాజరవగా, వారిలో 50 మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 265 మందికి శరీరకొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 23 మంది ఛాతి, ఎత్తు తదితర కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరణకు గురయ్యారు మిగిలిన 242 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 28 మంది విఫలమయ్యారు. తదుపరి 214 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 133 మంది అర్హత సాధించగా 81 మంది విఫలమయ్యారు. కాగా 214 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 194 మంది అర్హత సాధించగా 20 మంది విఫలమయ్యారు. మొత్తం 265 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 196మంది అర్హత సాధించగా, 69మంది విఫలమ య్యారు. కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ప్రతి సందర్భంలోనూ స్వయంగా పరిశీలించి, పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు ఎస్పీ పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు సుప్రజ , హనుమంతు, పలువురు అధికారులు పాల్గొన్నారు.


అభ్యర్థుల కొలతలు పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఆ.. చేద్దాంతే

- సచివాలయల ఉద్యోగుల్లో పెరుగుతున్న నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆదేశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిని సెట్ సరి చేయకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులు తలెత్తుతాయని కొందరు జిల్లా అధికారులు బహిరంగంగానే అంటున్నారు. కొందరు సచివాలయ ఉద్యోగుల్లో గత ప్రభుత్వంపై ఇప్పటికీ కృతజ్ఞత ధోరణి కనిపిస్తోందని అందువల్లే వారు ఇప్పటి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నారని కొందరు అంటున్నారు. అందువల్లే ప్రభుత్వ ఆదేశాలను సక్రమంగా పాటించకపోవడం.. పనులపై నిర్లక్ష్యం చేస్తున్నారని తెలుస్తోంది.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హవా..

సచివాలయ ఉద్యోగుల పనితీరు, వివరాల సేకరణపై కూడా గుంటూరు జిల్లాలో వివాదం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ మంత్రి దగ్గర ఉండి చాలా మంది జిల్లా అధికారులను సైతం దబాయించి మాట్లాడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సచివాలయ ఉద్యోగుల వ్యవహారాలు చూస్తున్నారు. జిల్లాలోని మొత్తం సచివాలయ సిబ్బంది ఆయన ఆధ్వర్యంలోనే పని చేస్తున్నారు. సదరు ఉద్యోగి సూచనలు మేరకే సర్వేలు, సచివాలయాల్లో పనులు జరుగుతున్నాయని సమాచారం. చివరకు నివేదికలు, ఇతర సమాచారం కోసం జిల్లా అధికారులు కూడా అదే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఆధారపడుతున్నారు.

రూ.4 వేలకు సర్టిఫికెట్

గురజాల టౌన్: అడిగినంత ఇస్తే చాలు ఏ సర్టిఫికెట్ అయినా గంటల్లోనే చేతికి అందుతోంది. ఆ సచివాలయంలో ఓ అధికారి బహిరంగంగానే నగదు వసూలు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాడు. తనకు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలుసని వసూళ్లలో మునిగితేలుతున్నాడు. సాధారణంగా జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు పొందాలంటే దాదాపు నెల రోజులకుపైగానే పడుతుంది. కానీ గురజాల మండలం పులిపాడు-1 సచివాలయంలో ఓ అధికారి గంటల్లోనే ఆ సర్టిఫికెట్ ఇస్తాడు. ఉదయం రూ.4 వేలు ఇచ్చి తల్లిదండ్రుల ఆధార్ కార్డులను వాట్సాప్ చేస్తే సాయంత్రం కల్లా జనన, మరణ ధ్రువీకరణ పత్రం చేతికి అందుతోంది. ఇటీవల గురజాలకి చెందిన ఓ వ్యక్తి సదరు ఉద్యోగికి రూ.4 వేలు ముట్టజెప్పి సర్టిఫికెట్‌ను పొందగా దానిని ఓ ప్రభుత్వ ఉద్యోగికి చూపించగా అది నకిలీదని తేలింది. నకిలీ బాగోతం అధికారులకు తెలిసినా వారు పట్టించుకోకపోవడంతో ఆ సచివాలయ అధికారి చెలరేగిపోతున్నాడు. ఈ అధికారికి మండల పరిధిలోని పలువురు గ్రామ కార్యదర్శులు, మండల అధికారులు సహకరిస్తున్నట్లు సమాచారం. జనన, మరణ సర్టిఫికెట్లే కాక గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కో సదరన్ సర్టిఫికెట్‌కు రూ.20 వేల దాకా తీసుకొని అధిక మొత్తంలో నకిలీ సర్టిఫికెట్లు అందించారనే ఆరోపణలు ఈ అధికారిపై ఉన్నాయి.


గుంటూరు జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న డివైడర్‌పై కూర్చుని ఉన్న పిచ్చి తల్లి

పిచ్చి తల్లి ఎదురుచూపులు !

నవమాసాలు మోసి, కని, పెంచి పెద్ద చేసిన పిల్లల కోసం ఎన్ని అవమానాలు, చీదరింపులు, చీత్కారాలు, మోసాలు ఇలా ఎన్ని ఎదురైనా ఏకబిగువున ఓర్చుకుంటుంది. మరి, తన కడుపున పుట్టిన పిల్లలే తనను మోసం చేస్తే.. ఆ తల్లి తట్టుకోలేదు.. పిచ్చెక్కిన్నట్లు అవుతుంది. ఇందుకు ఉదాహరణనే పై ఫొటోలో కనిపిస్తున్న ఓ పిచ్చి తల్లి. గుంటూరు జనరల్ ఆసుపత్రి ఎదుట ఉన్న డివైడర్‌పై పడుకొని ఆమె కాలం వెళ్లదీస్తూ ఉంటుంది. వాస్తవానికి ఆమెకు పిచ్చి లేదు. కడుపున పుట్టినబిడ్డలే ఆమెను పిచ్చి దానిని చేశారు. తెల్లవారేసరికి, చక్కగా తయారవుతుంది. తన సంచులన్నీ సర్దుకుని వచ్చిపోయే వాహనాలను గమనిస్తూ కూర్చుంటుంది. వస్తారో రారో కూడా తెలియని పిల్లల కోసం గంటల తరబడి ఎదురు చూసే ఆమె, చాలాసార్లు తన తిండి గురించి కూడా పట్టించుకోదని అక్కడి వాళ్లు చెబుతున్నారు. ఎవరైనా ఆమె వద్దకు వెళ్లి వివరాలు అడిగితే చెప్పే సమాధానాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. 'నా పేరు మేరీ' (నిజమో కాదో తెలియదు) అని చెబుతుంది. 'పిల్లలు ఎంత మంది?' అని అడిగితే 'పచ్చి బాలింతను' అని 'ఇక్కడ ఎందుకు ఉన్నావు?' అంటే, 'పిల్లలు వస్తారు.. తీసుకుపోతారు' అని చెబుతుంది. గత కొన్ని నెలలుగా ఆమెను అడిగినవారికి ఇవే వివరాలు చెబుతోంది. ఏ క్షణంలోనైనా తన పిల్లలు వచ్చి తనను తీసుకెళతారనే నమ్మకంతో ఉన్న ఆ పిచ్చితల్లి రాత్రి పూట ఏడుస్తూ పడుకుంటుంది. - (గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ధనుర్మాస వ్రత దీక్షలతో పుణ్యఫలం

మంత్రి నారా లోకేశ్



మంగళగిరి సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామికి అత్యంత ఇష్టమైన ధనుర్మసంలో దీక్షలను ఆచరించడం వలన పుణ్యఫలం సిద్ధిస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి శ్రీశైల నగర్‌లోని బాపూజీ విద్యాలయంలో వైటీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో త్రిదండి చినజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో మంత్రి లోకేశ్ మంగళవారం రాత్రి పాల్గొన్నారు. చినజీయర్ స్వామి మంత్రి లోకేశ్‌కు ఆశీర్వచనాలు అందజేసి కొద్దిసేపు ఆధ్యాత్మిక అంశాలపై చర్చించారు. మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఎగువ, దిగువ సన్నిధులు, విజయకీలాద్రి క్షేత్రాలను ధనుర్మాసంలో దర్శించుకోవడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపైనా వుండాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

ముక్కోటి ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

- 10న ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం


మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం



మంగళగిరిలోని ఆలయం వద్ద క్యూ ఏర్పాటు

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలు సన్నద్ధమవు తున్నాయి. ఇప్పటికే ఆయా ఆలయాల పాలక కమిటీలు, అధికారులు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో ఆలయ సిబ్బంది ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా అమరావతి వైకుంఠపురంలోని క్రౌంచగిరిపై స్వయంభువుగా వెలిసిన కలియుగదైవం వెంకటేశ్వరస్వామి ఆలయం, తెనాలి పట్టణంలోని సుప్రసిద్ధ క్షేత్రం వైకుంఠపురంలో వెలిసిన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, మంగళగిరిలోని మంగళాద్రి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంతో పాటు ఆలయాల వద్ద గోపురాల అలంకరణలతో పాటు, స్వామివార్ల దర్శనం, భక్తుల సౌకర్యార్ధం ఏర్పాట్లు ముమ్మంగా జరుగుతున్నాయి.

మంగళగిరి సిటీ, తెనాలి అర్బన్, అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో ముక్కోటి ఉత్సవాలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరుగనున్నాయి. 9న రాత్రి 8 గంటలకు శ్రీ స్వామి వారిని జగన్మోహినిగా అలంకరిస్తారు. 10వ తేది తెల్లవారుజాము ఒంటి గంట నుంచి 3 గంటల వరకు స్వామివారికి తిరువంజనోత్సవం, అనంతరం వేకువజాము 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బంగారు గరుడ వాహనంపై శ్రీవారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి ఏడాది మాదిరిగానే రెండు రోజులపాటు అంటే శుక్ర, శనివారాల్లో శంకుతీర్థం అందించనున్నారు. పదవ తేదీ రాత్రి నమ్మాళ్వార్ అధ్యయనోత్సవాలు (కొఠాయి ఉత్సవాలు) ప్రారంభమవుతాయి. ఈ ఏడాది ముక్కోటి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఎగువ, దిగువ సన్నిధుల్లో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఎగువ, దిగువ సన్నిధులను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. వైద్యం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ తదితర సమస్యలు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఇతర అధికారులు మంగళవారం ముక్కోటి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


తెనాలిలోని వెంకటేశ్వరస్వామి వారి ఆలయం

తెనాలి పట్టణంలోని సుప్రసిద్ధ క్షేత్రం వైకుంఠపురంలో ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు గావిస్తున్నామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ కంభం సాయిబాబు చెప్పారు. శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇందుకు చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం విలేకర్లకు వివరించారు. ఉత్తర ద్వార దర్శనం విశేషాలతో రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి అమ్మవార్లను ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై అలంకరించి భక్తులకు దర్శనం ఇప్పిస్తారు. దక్షిణావృత శంఖంతో తీర్థం పంపిణీ చేస్తారు. అనంతరం స్వామి అమ్మవార్ల మూలవరులను దర్శించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు గావిస్తున్నామని, క్యూ లైన్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. భక్తులకు తాగునీరు, పిల్లలకు, బాలింతలకు పాలు పంపిణీ, ఉచిత ప్రసాదం అందజేసేందుకు 7 వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈవో అనుపమ, అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వేద వ్యాస మహర్షి ఆలయం

అమరావతి వైకుంఠపురంలోని కలియుగ వైకుంఠ క్షేత్రంగా పేరుగాంచిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీ ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. తెల్లవారు జామున 4గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ఋత్వికులు స్వామివారి పాదలకు పాలాభిషేకం చేసి అనంతరం ప్రత్యేక అలంకారం, 5గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించడం జరుగుతుంది. స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయ ఉత్తర ద్వారంలో ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. 10 గంటలకు స్వామివార్ల గ్రామోత్సవం గరుడ వాహనంపై గ్రామ పురవీధులు, ఆలయ మాడ వీధులలో జరుగుతుంది. ఆలయాన్ని సందర్శించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడం జరుగుతుంది. ముక్కోటి పర్వదినం రోజునుండి ఐదు రోజుల పాటు అధ్యయన ఉత్సవాలు జరుగుతాయని ఉదయం సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.


మంగళగిరిలో ముక్కోటి ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థానం, ఎంటీఎంసీ అధికారులు

1027 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, జనవరి 7: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 1027 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, కాయ ఒకేధరలు పలుకగా, క్వింటాల్‌కు కనిష్ఠధర రూ. 10,750, గరిష్ఠధర రూ. 11,050, మోడల్‌ధర రూ.11,000 పలికాయి.

పశ్చిమడెల్టాకాల్వకు 1516 క్యూసెక్కులు

దుగ్గిరాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1516 క్యూసెక్కులను మంగళవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యారేజివద్ద 11.7 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 140 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 190, పశ్చిమకాల్వకు 100, నిజాంపట్నంకాల్వకు 50, కొమ్మమూరు కాల్వకు 965 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

'పైథాన్'లో ఉచిత శిక్షణ

మంగళగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి యువతకు పైథాన్ కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు లైబ్రేరియన్ గోలి ధర్మతేజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరి వీవర్స్ కాలనీ 2వ లైనులోని దామర్ల త్యాగరాజు, కోమల జ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయంలో శిక్షణ జరుగుతుందని, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 77806 17445 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

గ్రామసభకు 31 అర్జీలు

కాకుమాను, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళవారం జరిగిన రెవిన్యూ గ్రామసభలో 31 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. భూమి కొలతల కోసం 18 అర్జీలు, ఆన్‌లైన్ నమోదు కోసం 13 అర్జీలు, వచ్చినట్లు ఆయన వివరించారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు మండలంలోని 12 గ్రామాలలో జరిగిన రెవిన్యూ గ్రామసభల్లో 257 వచ్చినట్లు చెప్పారు. బుధవారం బోడిపాలెంలో జరిగే చివరి గ్రామసభను ఆ గ్రామ రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సర్పంచ్ విప్పడపు రాంబాబు, ఆర్ఐ ప్రియదర్శిని , వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె

మంగళగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు చేస్తున్న సమ్మె మంగళవారంతో నాల్గవ రోజుకు చేరింది. సీఐటీయూ నేతలు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, నెలకు వేతనం రూ.24,500 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు వీసం జవహర్‌లాల్, రాఘవులు, పీ.బాలకృష్ణ, బాలాజీ, పీ.పూర్ణచంద్రరావు, డి.శివ, ఎం.రవి, ఆర్.కృష్ణ, వై.శివ, పీ.శ్రీనివాసరావు, యోహాన్ పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్ల నమోదు

మంగళగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మెప్మా, హోం ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో తొలిదశ సర్వీస్ ప్రొవైడర్ల నమోదు కార్యక్రమం మంగళవారం ఎంటీఎంసీ కార్యాలయంలో జరిగింది. అడిషనల్ కమిషనర్ శకుంతల అర్జీలను స్వీకరించారు. పట్టణ పరిధిలోని ప్లంబర్స్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గీజర్, టీవీ మెకానిక్‌లు సేవలందించే వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా సర్టిఫికెట్లు అందించి హోం ట్రయాంగిల్ ప్లాట్‌ఫారం ద్వారా జీవనోపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీఎంఎం మాలతీ, ఆర్పీలు పాల్గొన్నారు.

12వరకు కులగణనపై అభ్యంతరాల స్వీకరణ

కాకుమాను, జనవరి 7: ఎస్సీ కులగణనపై అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణకు ఈ నెల 12 వరకు గడువు ఉందని తహసీల్దార్ వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్వర్వుల ప్రకారం కులగణనపై అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా అందజేయాలని ఎస్సీ వర్గాల ప్రజలకు సూచించారు. మండలంలోని గ్రామ సచివాలయాల ద్వారా అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 16వ తేదీ వరకు వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి 20న గ్రామ సచివాలయాల వద్ద వివరాలను ఉంచుతామన్నారు. మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణలో అభ్యంతరాలుపై విచారణ ఉంటుందని తహసీల్దారు తెలిపారు.

రెవెన్యూ సదస్సులో 35 అర్జీలు స్వీకరణ

తాడికొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలం లాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 35 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కే నాసరయ్య పేర్కొన్నారు. 23 అర్జీలు రెవెన్యూ సమస్యలు, 11 అర్జీలు సర్వే సమస్యలు, పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు వేయాలని ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు 45 రోజుల్లో పరిష్కరింస్తామని తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

తాడేపల్లి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం మహానాడులో గంజాయి విక్ర యిస్తున్న ఓ వ్యక్తిని తాడేపల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేసి అతడి నుంచి అరకేజి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తాడేపల్లి పోలీసులు తెలిపారు.

అడవులను తలపిస్తున్న జగనన్న లేఔట్లు

- కాలనీలు కంపచెట్లమయం
- మౌలిక వసతులు, సౌకర్యాలు శూన్యం
- నిర్మాణాలకు ఆసక్తి చూపని లబ్ధిదారులు
- వసతుల కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టి

గత వైసీపీ ప్రభుత్వంలో పేదలందరికీ పక్కా ఇళ్లు అంటూ క్షేత్రస్థాయిలో ఊదరగొట్టారు. జనావాసాలకు దూరంగా లేఔట్లు కేటాయించి, తూతూమంత్రంగా లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇచ్చిన లేఔట్లో మౌలిక సదుపాయాలు లేక, రవాణా మార్గాలు లేక నిర్మాణాలు చేపట్టేందుకు ఏ ఒక్క లబ్ధిదారూ ముందుకు రాని పరిస్థితి. దీంతో ఆయా కాలనీలన్నీ కంప చెట్లతో నిండి అడవిని తలపించేలా ఉన్నాయి.


గోగులమూడిలో చెరువును తలపిస్తున్న జగనన్న లేఅవుట్

పెదనందిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో 17 గ్రామాలకు గాను 57.26 ఎకరాల భూమిని 1719 మంది లబ్ధిదారులకు 1.50 సెంట్లు చొప్పున కేటాయించి పట్టాలు అందజేశారు. మండలంలో లేఔట్లు ముళ్లపొదలతో నిండిపోయి, వర్షం పడితే కాలనీలు నీట మునుగుతున్నాయి. లబ్ధిదారులకు ఏదోవిధంగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి చేతులు దులుపుకుందామనుకున్నారో ఏమో నివాసయోగ్యం కాని చోట, వైసీపీ నేతల భూములున్న ప్రదేశాలను ఎంచుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ ప్రాంతంలోనే లేఔట్లు వేసి పట్టాలు పంపిణీ చేశారు. పెదనందిపాడులో ఇళ్ల స్థలాలకు భూములు దొరక్కపోవడంతో నాగులపాడులో ఎందుకూ పనికిరాని కొంత ప్రభుత్వ భూమిని, నాయకుల పొలాలను కొనుగోలు చేసి లేఔట్లు వేసి లబ్ధిదారులకు ఇచ్చారంటూ మండిపడుతున్నారు. వీటిలో నాయకుల అండదండలు ఉన్నవారికి ముందు వరుసలో.. ఒక్కో కుటుంబంలో ఇద్దరికి చొప్పున పట్టాలు పంపిణీ చేశారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గోగులమూడిలో మేకలవాగు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో లేఔట్ వేయడంతో అది చిన్నపాటి వర్షాలకు తటాకాన్ని తల పించడంతో ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేది ఎలా అంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయమై పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా పట్టించుకున్న నాథుడే లేడని లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో గత ప్రభుత్వ పాలకులు లబ్ధిదారుల బాగోగుల గురించి పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇళ్ల నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం దృష్టి

పేదవాడి సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. దీనిలో భాగంగా తొలివిడతగా వివిధ దశల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టే విధంగా అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో ప్రచార ఆర్భాటాలే తప్ప ఎక్కడా నిర్మాణాలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇటీవల సీఎం చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మన ఇల్లు, మన గౌరవం అనే పథకం ద్వారా నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే అధికారులు లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేసి, నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


నాగులపాడులో అడవిని తలపిస్తున్న కాలనీ లేఅవుట్

17న రైతు సమస్యలపై ధర్నా



ప్రసంగిస్తున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

తాడేపల్లి, జనవరి7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జనవరి 17వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న కేబీ భవన్‌లో రైతు సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు జమచేయలేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లోనూ, రబి సీజన్‌లోనూ జమ చేయకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారన్నారు. తక్షణమే అన్నదాత, సుఖీభవ నిధులు విడుదల చేయాలన్నారు. జొన్నా శివశంకర్ మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు మంజూరు చేయాలని పెదవడ్లపూడి హైలెవల్‌చానల్ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు, నేతలు వెంకటేశ్వరరావు, కొర్రపోలు ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా నమోదు వేగవంతం

కాకుమాను, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాల కోసం ఉపయోగపడే పంటల బీమా పథకం రైతుల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి అన్నారు. మండల పరిధిలోని కొమ్మూరు, బీకే పాలెం గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రైతులు రబీ సీజన్‌లో మొక్కజొన్న, మినుము, పెసర, శనగ పైర్ల సాగు చేస్తున్నారని రైతులు సీఎస్ సెంటర్‌ల ద్వారా పంటల బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోలని ఏవో రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు షణ్ముఖ క్షేత్రపాల్, సుల్తానా, రైతులు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి అర్జీలు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న రైతులు

కేఎల్‌యూ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

తాడేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్‌యూ రహదారి మార్గంలో కుంచనపల్లి వంతెన నుంచి మెల్లెంపూడి వరకు నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ప్రతి రోజూ ఉదయం వాహనాల రద్దీ ఈ మార్గంలో ఎక్కువగా ఉంటుంది. మంగళవారం సుమారు గంటకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం కుంచన పల్లి మెల్లెంపూడి, గుండిమెడ, వడ్డేశ్వరం, రేవేంద్రపాడు తదితర గ్రామాల ప్రజలు రైతులు ఈ రహదారి మీదుగానే విజయవాడ వెళుతుంటారు. అదే సమయంలో కేఎల్‌యూకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల వాహనాలు వస్తూ ఉంటాయి. దీంతో నిత్యం ఈ మార్గం బిజీగా ఉంటూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. నిత్యం ఇటువైపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని కళాశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని అటు విద్యార్థులు, తమ కార్యాలయాలకు వెళ్లలేక పోతున్నామని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. కళాశాల విద్యార్థులకు లేటయితే అధ్యాపకులు వారిని బయటే నిలబెడుతున్నారని, విద్యార్థులు వాపో తున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ నివారణకు పోలీస్ సిబ్బందిని ఉదయం సాయంత్రం విధి నిర్వహణకు నియమించాలని వాహనదారులు కోరుతున్నారు.


కేఎల్‌యూ రోడ్డులో ట్రాఫిక్ జామ్ దృశ్యం

రెవెన్యూ గ్రామ సభకు అధికారుల డుమ్మా

- అర్జీ తీసుకునేందుకు నిరాకరించిన సిబ్బంది

ప్రత్తిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను అధికారులు నీరు గారుస్తున్నారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించి రైతులకు సత్వర న్యాయం చేయాలనే లక్ష్యంతో గ్రామసభల ద్వారా రైతుల సమస్యలు విని వాటి పరిష్కార మార్గాలను చూపాల్సిన అధికారులు రెవెన్యూ సదస్సులకు రాకపోగా రైతులు ఇచ్చిన అర్జీలను కూడా తీసుకునేందుకు సిబ్బంది నిరాకరిస్తున్నారు. మండలపరిధిలోని యనమదల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామకు దేవదాయ శాఖ అధికారులు డుమ్మా కొట్టారు. ఈ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 384లో దేవదాయ శాఖకు సంబంధించి మూడెకరాల భూమితో పాటు తిక్కిరెడ్డిపాలెం, ప్రత్తిపాడు గ్రామాలకు చెందిన మరో 16 మంది రైతులకు సంబంధించి సుమారు 20 ఎకరాల భూమి ఉంది. ఈ సర్వే నెంబరు మొత్తాన్ని దేవదాయ శాఖ భూమి కింద రౌండ్ చేసి ఉండటంతో ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అర్జీ ఇచ్చేందుకు మధ్యాహ్నం ఈ రెండు గ్రామాల రైతులు రెవెన్యూ సదస్సుకు వెళ్లారు. దేవదాయశాఖకు సంబంధించి సమాధానం చెప్పే అధికారి లేకపోవడంతో రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించారు. దేవదాయ శాఖ వారు సమాధానం చెపితేనే అంటూ వారు దాట వేశారు. సరే అర్జీ తీసుకుని ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసి మాకు ఎక్నాలడ్జ్‌మెంట్ ఇవ్వండి అంటూ వేడుకున్నారు. అందుకు సిబ్బంది నిరాకరించారు. గ్రామ సభలో సమస్యలు వినే వారు కూడా లేరంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీలో వసతుల పరిశీలన

దుగ్గిరాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈమనిలోని ప్రాథమిక వైద్యఆరోగ్యకేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, వైస్ ఎంపీపీ పసుపులేటి సాయిచైతన్యలు సందర్శించారు. పీహెచ్‌సీలో పలుబ్లాక్‌లలో వైద్యపరికరాలను, రోగులకు ఏర్పాటుచేసిన బెడ్‌లు, లేబొరేటరీ, వైద్యపరికరాలు, అత్యవసర మందుల నిల్వలను పరిశీలించారు. కుక్కకాటు, పాముకాటు మందు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని డాక్టర్ శ్రీవల్లికి సూచించారు. పీహెచ్‌సీకివచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, సిబ్బంది సహకారంతో సేవలందించాలన్నారు. తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీవో శ్రీనివాసరావు, జనసేన నేత పీ.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

అర్హులకే రూ.15వేల పింఛన్లు

దుగ్గిరాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పనిచేయలేని స్థితిలో ఇంటివద్దే ఉండిపోయిన ఇళ్లకు వెళ్లి అధికారులు వారి అర్హతపై సర్వే నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లను రూ.1000 ఒకేసారి పెంచడంతోపాటు దివ్యాంగులకు రూ.6వేల చొప్పున అందిస్తున్న విషయం విదితమే. కాగా కుటుంబాన్ని పోషించే వ్యక్తి అనారోగ్యకారణాలతో ఇంటి వద్దే ఉంటున్న వారిని గుర్తించి పింఛన్లను అందించే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూర్తిస్థాయిలో పీహెచ్‌సీ 10 సచివాలయాల పరిధిలో రూ.15 వేల పింఛన్‌ను పొందే 22 మంది ఇళ్లకు వెళ్లి ఆర్థిక, శారీరక స్థితిగతులపై పునఃసమీక్షించారు.

రోడ్డు ప్రమాదాలకు చెక్

ఫిరంగిపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - కర్నూలు రహదారిపై ఫిరంగిపురంలోని డివైడర్లను వాహనాలు గుర్తించ లేక ప్రమాద వశాత్తు ఢీకొనటంతో ప్రాణాలు పోవటం లేదా గాయపడటం నిరంతరం జరుగుతున్నందున సీఐ బీ రవీంద్రబాబు డివైడర్లకు ఇరు వైపులా మంగళవారం గుర్తింపు సూచికలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని ఆయన వివరించారు.


డీవైడర్ల వద్ద సూచికలను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ఆక్యుప్రెషర్‌తో మానసిక ఒత్తిడి దూరం

తాడికొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆక్యుప్రెషర్‌తో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని స్టూడెంట్ కౌన్సిలర్, స్ట్రెస్ రిలీఫ్ థెరపిస్ట్, ఆక్యురెపిస్ట్ డాక్టర్ ఎం. శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం తాడికొండలోని భగవాన్ సత్యసాయిబాబా జూనియర్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అక్యుప్రెషర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్యుప్రెజర్‌తో శరీర రుగ్మతలు పరిష్కారం అవుతాయన్నారు. అరచేతులే ఆయుధాలుగా ఉపయోగించి స్ట్రెస్ రిలీఫ్ అవుతుందని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న డిప్రెషన్, నిద్ర లేమితనం, ఆందోళన, సూసైడ్ పెండెన్సీ వాటిని ఏలా ఎదుర్కోవాలో సలహాలు ఇచ్చారు. మానవ శరీరమే శక్తి నిలయమని, మానవశరీరంలో 12 ఆర్గాన్స్ ఉంటాయన్నారు. ఏ ఆర్గానులో శక్తి తగ్గుతుందో అప్పుడే రోగం రూపంలో బయట వేస్తుందన్నారు. మైగ్రేన్, తలనొప్పి, మోకాళ్ల నొప్పులు, మెడ నొప్పులు, వివిధ రుగ్మతలతో బాధపడుతున్నటువంటి విద్యార్థు లకు ఆక్యుప్రెషర్ పాయింట్లను వివరించారు. కార్యక్రమంలో కళాశాలలో ప్రిన్సిపాల్ కే. సునిత లక్ష్మీ, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.


ఆక్యుప్రెజర్ చికిత్సపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శివకుమార్

రహదారి మరమ్మతు పనులు వేగవంతం

దుగ్గిరాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెనాలి-విజయవాడ ప్రధానరహదారి మరమ్మతులు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రేవేంద్రపాడు నుంచి మోరంపూడి వరకూ, దుగ్గిరాల పాతలాకు వద్ద నుంచి చింతలపూడి గ్రామశివారు వరకూ పనులు ప్రారంభించారు. గతపదేళ్లలో కనీస మరమ్మతులకు నోచుకోక గుంతలమయమైన ఈ రోడ్డులో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఎన్నికల హామీలో భాగంగా మంత్రి లోకేశ్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా దుగ్గిరాల పాతలాకు నుంచి మోరంపూడి వరకూ బీటీరోడ్డు నిర్మించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఏఎన్‌యూ క్రికెట్ జట్టులో చలపతి విద్యార్థి

తాడికొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టులో లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంధ్ర క్రికెట్ అండర్ -19 జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కే.ఎస్.ఎన్ సాత్విక్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టులో చోటు సంపాదించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో జరగనున్న విశ్వవిద్యాలయాల్లో టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఏఎన్‌యూ క్రికెట్ జట్టుకు ఎన్నికైలన సాత్విక్‌ను కళాశాల ఛైర్మన్ వై.వీ.ఆంజనేయులు, సెక్రటరి సుజిత్‌కుమార్‌లు అభినందించారు.

నమస్తే పథకంలో నమోదు చేసుకోవాలి

మంగళగిరి సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం పథకంలో ఎంటీఎంసీ పరిధిలోని మల మురుగు, సెప్టింగ్ ట్యాంకు శుభ్రం చేసే కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కమిషనర్ అలీం బాషా కోరారు. కార్మికులకు జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా ఈ పథకం ప్రవేశపెట్టబడిందన్నారు. భూగర్భ డ్రెయినేజీ శుభ్రపరిచే కార్మికులు, సెప్టిక్ ట్యాంకు డ్రైవర్లు, హెల్పర్లు ఈ పథకంలో నమోదైతే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక సదుపాయాలు అందుతాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రెట్టింపు వైద్య సాయం అందించడం జరుగుతుందని, ఎంటీఎంసీ పరిధిలోని కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్య

ప్రత్తిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పురుగుముందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలపరిధిలోని తుమ్మలపాలెంలో జరిగింది. మంగళవారం ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం, ఇలపావులూరు గ్రామానికి చెందిన సాయిసుధ (18)కి ఆరు నెలల క్రితం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కట్టిబోయిన సురేష్‌తో వివాహమైంది. అయితే సాయిసుధ ఇటీవల విపరీతంగా కడుపులో నొప్పి వస్తుందంటూ తన తల్లి కోటిలక్ష్మికి ఫోన్ చేసి చెప్పింది. ఈ నెల 3న ఇంట్లో అత్తతో పాటు భర్త పనులకు వెళ్లిన సమయంలో కడుపులోనొప్పి తట్టుకోలేక కూల్‌డ్రింగ్‌లో పురుగుమందు కలుపుకుని తాగింది. ఇదే విషయాన్ని తన తల్లికి ఫోన్ చేసి చెప్పింది. వెంటనే వారు అల్లుడికి సమాచారం ఇవ్వడంతో 108 అంబులెన్సులో గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. సాయి సుధ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

తాడేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి జనసేన, టీడీపీ నేతలు జొన్నా రాజేష్, గాదె వినయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాడేపల్లి సూపర్‌లీగ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఉదయం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర రావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రీడలను విచ్ఛిన్నం చేస్తే కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఇలా క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం హర్షణీ యమన్నారు. కార్యక్రమంలో గాదె వెంకటేశ్వరరావు, కొల్లి శేషు, జొన్నా రాజేష్, గాదె వినయ్, గంజి చిరంజీవి, అంబటి తిరుపతిరావు, చాముండేశ్వరిదేవి, తోట సాంబశివరావు, వీరిశెట్టి వెంక టేశ్వరరావు, దినేష్, బాడిత శంకర్, యర్రంశెట్టి రాము, వాసా శ్రీనివాసరావు, స్థానిక నేతలు, జనసేన, టీడీపీ కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

35వ రోజుకు ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారంతో 35వ రోజుకు చేరుకు న్నాయి. ఈ రిలే దీక్షలను మంగళవారం యూనియన్ నేత కూరపాటి స్టీవెన్, రాజధాని రైతు సంఘం నాయకులు టీ బక్కిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ ఇప్ప టికే 171 మంది ఏసీసీ కార్మికులు అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో పల్లెపోగు జోసఫ్, శీలం శంకరరావు, కూరపాటి వెంకట మోహన రావు, కంభాల వెంకటేశ్వర్లు, కంభాల డేవిడ్‌రాజు కూర్చున్నారు. కార్యక్రమంలో బూరగ అంకయ్య, ఆశీర్వాదం, ఏఐఎఫ్‌టీయూ నేత కె.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.


కంద్రిక గ్రామంలో చౌక డిపో బియ్యాన్ని పట్టుకున్న తహసీల్దార్ జే ప్రసాదరావు

రేషన్ బియ్యం స్వాధీనం

ఫిరంగిపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంద్రిక గ్రామం నందు గల 0724030 నెంబరు చౌక ధరల దుకాణంలో తహ సీల్దార్, రెవెన్యూ అధికారుల బృందం తనిఖీ చేసి 5,775 కేజీలు బియ్యం, పంచాదార 19 ప్యాకెట్లు, కందిపప్పు రెండు కేజీలు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా పట్టుకున్నామని రెవెన్యూ అధికారులు మంగళవారం తెలిపారు. రేషన్ షాపు నిర్వహకురాలిపై 6(ఏ) కేసు నమోదుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పేజే ప్రసాదరావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

పొన్నూరు టౌన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో చీరాలకు చెందిన దంపతులకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం చీరాలకు చెందిన ఎలమంద, మంగమ్మ దంపతులు ద్విచక్రవాహనంపై గుంటూరు వైపు నుంచి చీరాల వెళుతూ దొప్పలపూడి అడ్డరోడ్డు వద్ద ఆగివున్న జేసీబీని దంపతుల ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో యలమంద, మంగమ్మ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో 108 వాహన సిబ్బంది క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఇంటిలో నగలు మాయం

తెనాలి అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగానమ్మపేటలో నివసిస్తున్న షేక్ నమాజ్ తన గృహంలో నగలు కనిపించడం లేదని మంగళవారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 2న తమ ఇంటిలో జరిగిన శుభ కార్యానికి అతిథులు వచ్చి వెళ్లారని, ఇంటిలో నగలు కోసం మంగళవారం చూడగా కనిపించలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆభరణాల విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని టూ టౌన్ ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను హింసించిన ఘటనలో నిందితులకు రిమాండ్

తెనాలి, మారీసుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాలికను హింసించిన ఘటనలో న్యాయస్థానం నిందితులకు రిమాండ్ విధించింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజమండ్రి అనపర్తికి చెందిన దుర్గాదేవి భర్తతో విభేదాలు రావడంతో ఏడేళ్ల కుమార్తెతో స్థానిక సీఎం కాలనీకి చెందిన బషీరున్‌బీ వద్ద పనికిచేరింది. బషీరున్‌బీకి పిల్లలు లేకపోవడంతో చిన్నారిని చేరదీసింది. అనంతరం దుర్గాదేవి పాపను ఆ ఇంటిలో విడిచి అక్కనుండి వెళ్లిపోయింది. అప్పటినుంచి పాప యోగక్షేమాలు బషీరున్‌బీ చూసుకునేది. ఇదిలాఉండగా పాప మాట వినడంలేదని బషీరున్‌బీ చిన్నారిని హింసిస్తుండటంతో స్థానికులు గత సంవత్సరం జూలై నెలలో మహిళ శిశు సంక్షేమ కేంద్రానికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు పాపను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాపను శిశు సంక్షేమ కేంద్రానికి తరలించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితురాలు బషీరున్‌బీ ఆమెకు సహకరించిన మరిది ముద్రబోయిన వెంకటాచలం, చిన్నారి తల్లి దుర్గాదేవిలను మంగళవారం రైల్వే స్టేషన్ ప్రాంతంలో అదుపులోకి తీసుకొని న్యాయస్థానం ఎదుట హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

విటమిన్ ఏ ప్రాముఖ్యతను వివరించండి

● జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ

తెనాలి, మారీసుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అందించవలసిన విటమిన్ ఏ ద్రావణం ప్రాముఖ్యతను తల్లులకు వివరించాలని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం ఆశా కార్యకర్తలకు సూచించారు. మంగళవారం స్థానిక మారీసుపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం ముఖ్య అతిథిగా పాల్గొని ఆశా కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు. ఆశ యాప్ ద్వారా ఎన్‌సీడీ సర్వే, కీటక జనిత వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. అనంతరం పద్మశాలిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆశాడే కార్యక్రమంలో పాల్గొని ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఉడా కాలనీలో దోమల నివారణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ దివి కిషోర్‌కుమార్, దోనేపూడి హరిణి, సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ కెనాల్‌ను పరిశీలించిన కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురం దేవస్థనం వద్ద ఉన్న వెస్ట్ కెనాల్‌ను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జరగనున్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వార్ల తెప్పోత్సవం కోసం వెస్ట్ కెనాల్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. కెనాల్‌లోని వ్యర్థులను తొలగించి నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వైకుంఠపురం దేవస్థాన అర్చకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15వ వార్డులో పారిశుధ్య కార్యక్రమాలు

ముత్తెంశెట్టిపాలెంలోని 15వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శేషన్న అధికారులలో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: ఎంఈవో

కొల్లిపర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దావులూరిపాలెం, కొల్లిపర ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు మెనూను అమలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఓపెన్ జిమ్.. నిరుపయోగం



జిమ్ వద్ద సంచరిస్తున్న పందులు

● రూ.29 లక్షలతో 2019లో జిమ్ ప్రారంభం
● ఐదేళ్లల్లో తుప్పుపట్టి పనికిరాని పరికరాలు
● మరమ్మతులు లేక వినియోగం నిల్
● అపరిశుభ్ర వాతావరణంలో జిమ్ పరిసరాలు
● కొరవడిన అధికారుల పర్యవేక్షణ

తెనాలి, మారీసుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు వ్యాయామం చేసేందుకు స్థానిక 30వ వార్డులోని అమరావతి ప్లాట్స్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. 2019 సంవత్సరంలో అప్పటి టీడీపీ శాసన సభ్యుడు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ హయాంలో రూ.29 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. చుట్టూ పెద్ద గోడలు, పెద్ద గేట్లతో అన్ని హంగులతో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్థానిక యువకులు, చిన్నారులు, గృహిణిలు, వయోవృద్ధులు ఆ పరికరాలను ఉపయోగించుకునేవారు. ఈ విధానం కొన్నేళ్లు సజావుగా సాగింది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక జిమ్ నిర్వహణను పట్టించుకోవటంతో క్రమేపీ ఒకొక్క జిమ్ పరికరాలు మరమ్మతులతో నిలిచిపోయాయి. ఫుల్ చైర్ డబుల్స్ వ్యాయామం చేసే పరికరం ఒక కాలు విరిగి మరొక కాలు తుప్పుపట్టి ఉండగా హ్యాడిల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. అదేవిధంగా చేతి కండరాల వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన బాహుచక్రం కూడా ఇదే విధంగా తయారయ్యియింది. చిన్నారులు ఆడుకునే సీసా బాలెన్స్ బల్ల తుప్పుపట్టి పనికిరాకుండా పోయింది. ఉయ్యాల బల్లలు మాయమైపోగా వాటి ఫ్రేమ్ మాత్రం మిగిలింది. దీనితో జిమ్‌కు వచ్చేవారు పరికరాలు పాడైపోయి ఉండటంతో వాటిని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వాటిని వినియోగించుకునే వారు లేకపోవడంతో ఆ పరికరాలను తుప్పు తినేస్తూ జిమ్ పూర్తిగా నిరుపయోగంగా మారింది. చుట్టూఉన్న ప్రహరీ కొంతమేర దెబ్బతింది. మున్సిపల్ అధికారులు ఓపెన్ జిమ్ పరిసరాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేపట్టకపోవడంతో పందుల స్వైరవిహారంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొని పందులకు నిలయంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంపై పలు ప్రజా సంఘ నాయకులు విమర్శిస్తున్నారు. వాటికి చిన్నచిన్న మరమ్మతులను చేసిఉంటే ఉపయోగంలో ఉండేవని ఆ ప్రాంత ప్రజలు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. రూ.29 లక్షలతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేలా ఓపెన్ జిమ్‌ను మంచి ఆశయంతో ఏర్పాటు చేస్తే నిర్వహణా లోపంతో నిరుపయోగంగా మార్చడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి ఓపెన్ జిమ్ ప్రాంతాన్ని పరిశీలించి మరమ్మతులకు గురైన పరికరాలను రిపేరు చేయించడంతో పాటు చుట్టూ ప్రహరీ నిర్మించి, పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజలకు జిమ్‌ను అందుబాటులోకి తీసుకురావలని పలువురు కోరుతున్నారు.



పాడైపోయిన వ్యాయామ పరికరాలు



తుప్పుపట్టి పాడైపోయిన బ్యాలెన్స్ బల్ల

కేటాయించిన షాపుల్లోనే వ్యాపారాలు నిర్వహించుకోవాలి

● మున్సిపల్ అసిస్టెంట్ సిటీప్లానర్ శివన్నారాయణ

తెనాలి, మారీసుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం వారు కేటాయించిన షాపులలోనే వ్యాపారాలు నిర్వహించుకోవాలని షాపు లీజుదారులకు మున్సిపల్ అసిస్టెంట్ సిటీప్లానర్ శివన్నారాయణ సూచించారు. మంగళవారం స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మున్సిపల్ అసిస్టెంట్ సిటీప్లానర్ శివన్నారాయణ, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్‌తో కలసి ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీలలో భాగంగా మున్సిపల్ మార్కెట్ షాపింగ్‌లో కేటాయించిన షాపు నిర్వాహకులు బయట స్థలాలలో కూడా ఆక్రమించి కూరగాయల వ్యాపారాలను నిర్వహిస్తుండటం గుర్తించారు. దీంతో వ్యాపారాలను కేటాయించిన షాపుల్లోనే విక్రయాలు జరపాలని, బయట ఆక్రమణలకు గురిచేయవద్దన్నారు. కాంప్లెక్స్‌లో రాకపోకలకు ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని వారు వివరించారు. వ్యాపారులు మాత్రం తాము అద్దెలు కడుతున్నామని తగినంత ఆదాయం రాక బయటకు వచ్చి విక్రయాలు జరపాల్సిన పరిస్థితి నెలకొందని అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నిబంధనల ప్రకారమే వ్యాపారాలు చేయాలని అధికారులు స్పష్టంచేయటంతో చిరువ్యాపారులు ఆందోళన చేపట్టారు. దీనిపై అధికారులు సర్దిచెప్పడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణదారులతో చర్చిస్తున్న మున్సిపల్ ఏసీపీ శివన్నారాయణ, టీపీవో సాంబశివరావు తదితరులు

సదరం సర్టిఫికెట్లపై వైద్యుల తనిఖీలు

● తొలిరోజు 16మంది పింఛనుదారులకు పరీక్షలు

తెనాలి రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నిజమైన లబ్ధిదారులకే పింఛన్లు అందేలా చూస్తామని వైద్య బృంద సభ్యులు వెల్లడించారు. అనారోగ్యంతో మంచంపట్టిన వారికి, దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలవాలన్న ఉద్దేశంతో పింఛన్లను అందిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిజమైన లబ్ధిదారులతో పాటు దొంగపత్రాలు సృష్టించి వాటి ద్వారా అనర్హులు సైతం దివ్యాంగుల కోటాలో పింఛన్లు పొందుతూ ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నట్లు పలు ప్రాంతాల్లో ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో వారి ఆటకట్టించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా ప్రతి మండలంలో సదరం సర్టిఫికెట్ల ద్వారా పింఛన్ పొందే లబ్ధిదారుల అర్హతపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెనాలి మండలంలో మొత్తం 48 మంది ఉండగా మంగళవారం వారి వద్దకు వైద్యబృందం పర్యటించి వివరాలు నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ పరిధిలో తొలిరోజు 16మంది వద్దకు వైద్యబృందం ఆర్థోపెడిక్ డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, ఒక జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాఘవరెడ్డి, సంబంధిత ఏరియా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ హనీఫ్ ఇతర సిబ్బందితో గ్రామాల్లో పర్యటించారు. వారికి పరీక్షలు జరిపి వివరాలు నమోదు చేశారు. సర్వే పూర్తి అయిన తరువాత పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు వారు వెల్లడించారు.



అంగలకుదురులో పింఛన్‌దారులను పరీక్షిస్తున్న వైద్యులు

ఘనంగా గంధ మహోత్సవం

పొన్నూరు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న చౌక్ మసీద్‌లో మంగళవారం అజ్మీర్ షరీఫ్ ఖాజా గరీబ్ నవాజ్ చిష్టి ఔలియా మహాత్ముల గంధ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బులియన్ మర్చంట్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ షఫాయితుల్లా, మిత్ర బృందం ఆధ్వర్యంలో తొలుత చౌక, మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గౌస్, మొహమ్మద్ ఫాజిల్, సయ్యద్ సంధాని, అబ్దుల్ జహీర్, అబ్దుల్ సలీం, చాన్‌బాషా, సయ్యద్ ఆసీస్, అలీ, బాబావాలి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి: ఎంపీడీవో

చేబ్రోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో కొప్పాక లలిత కోరారు. చేబ్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల గ్రామస్థాయి అధికారులు ఈ సభలో పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సరఫరా వంటి సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై కార్యదర్శి శ్రీనివాసరావు సూచనలు ఇచ్చారు. ఈ సభలో సర్పంచ్ అత్తోట వినీతారాణి, తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యసాధన కోసం శ్రమించాలి'

పొన్నూరు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యంను సాధించేందుకు అవిశ్రాంతంగా శ్రమించాలని సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు ప్రత్యూష సుబ్బారావు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం సుబ్బారావును మానవత సంస్థ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివలక్ష్మి మానవత సంస్థ అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి నన్నపనేని బాలకృష్ణ, రమణ, సాంబశివరావు, షేక్ యాసిన్ బాబా, లియాకత్, వై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

పొన్నూరు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో జీవ శిలీంద్ర నాశినిలను వినియోగించాలని జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ ఐ.సునీత అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి, కసుకర్రు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడిలో తమలపాకు తోటలను, కసుకర్రులో మొక్కజొన్న పైరును పరిశీలించి సూచనలు ఇచ్చారు. మొక్కజొన్న పైరులలో ఎరువులు వినియోగం, పురుగు నివారణ చర్యలు గురించి సూచనలు ఇచ్చారు. జీవ శిలీంద్ర నాశినిలు ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్ వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ పి.రామకోటేశ్వరి, ఏవో డేగల వెంకట్రామయ్య, పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ రవి కిరణ్, హార్టికల్చర్ అధికారి పి.ఉష తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మపేటలో గొబ్బిళ్ల ఉత్సవం



గొబ్బిళ్ల ఉత్సవంలో పాల్గొన్న శారదా చలపతి బృందం

తెనాలి అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగానమ్మపేటలో మంగళవారం గొబ్బిళ్ల ఉత్సవం నిర్వహించారు. ధనుర్మాసం పురస్కరించుకుని ఆధ్యాత్మిక సేవకురాలు శారదా చలపతి బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. ధనుర్మాసంలో గొబ్బిళ్లను లక్ష్మీస్వరూపంగాను, గోపిక స్వరూపంగాను పూజిస్తారని చెప్పారు. శ్రీకృష్ణుడు గోపికలను కరుణించిన విధంగా భక్తులను అనుగ్రహిస్తారని తెలిపారు. ఇందుకు వాడే ద్రవ్యాలతో పర్యావరణం కలుషితం కావడాన్ని అరికట్టవచ్చన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. మహాలక్ష్మి, నాగమణి, ఆదిలక్ష్మి, శ్రీదేవి, ధనలక్ష్మి, సుశీల పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు

తెనాలి అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే, జడ్పీచైర్మన్ దివంగత దొడ్డపనేని ఇందిర జయంతి పురస్కరించుకుని ఆమె కుమార్తె మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ విద్యార్థులకు నగదు అందజేశారు. రూపశ్రీ, నందిని, షేక్ ఫర్వీనా, హఫీజ్‌లకు రూ.6వేలు అందించారు. కార్యక్రమంలో గుమ్మడి సాంబశివరావు, గుమ్మడి రమేష్, నేలటూరి బెన్ను, కొడాలి శ్రీనివాసరావు, రాజశేఖరరెడ్డి, పూర్ణచంద్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. 700 మంది విద్యార్థులకు పూలు, పండ్లు పంపిణీ చేశారు. వహాబ్ చౌక్‌లో ఇందిర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ

న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు

పొన్నూరు టౌన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది బేతాళ ప్రకాశ్‌పై దాడిచేసిన పోలీసులపై, ఫిర్యాదు చేసిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పొన్నూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభమైయ్యాయి. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో శిబిరం ఏర్పాటు చేశారు. బేతాళ ప్రకాష్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాష్‌పై దాడి చేసిన వారిని శిక్షించకుంటే ఉద్యమాన్ని తీవ్ర తరం చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ దీక్షల శిబిరంలో న్యాయవాదులు, గుమస్తాలు పాల్గొన్నారు.

అర్ధరాత్రిలోనూ మహిళా మీ కోసం వాహనం సిద్ధం

● ట్రాఫిక్ ఎస్ఐ రాజ్యలక్ష్మి

తెనాలి క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అనుకోని పరిస్థితుల్లో ప్రయాణాల్లో ఆలస్యం జరిగి రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌లో అర్ధరాత్రి దిగిన ఒంటరి మహిళల కోసం పోలీసులు మహిళా మీ కోసం వాహనాలు అందుబాటులోకి ఉన్నాయని ట్రాఫిక్ ఎస్ఐ రాజ్యలక్ష్మి మంగళవారం వెల్లడించారు. రాత్రివేళల్లో ఒంటరి మహిళలు, విద్యార్థినులు, ఆటోలు ఎక్కాలంటే ఆందోళనకు గురవుతుంటారు. అలాంటి వారు ట్రోల్ ఫ్రీ నెం.112 గాని లేదా 97464 14614కి కాల్ చేసి సమాచారం ఇస్తే వారిని మహిళా మీ కోసం ఏర్పాటు చేసిన వాహనం గాని నైట్ పెట్రోలింగ్‌లో ఉండే పోలీసు వాహనంగాని అందుబాటులోకి వచ్చి గమ్యస్థానం చేర్చడం జరుగుతుందన్నారు. పోలీసులు అందిస్తున్న ఈ సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.



బాధిత కుటుంబానికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

బాధిత కుటుంబానికి సాయం అందజేత

పెదకాకాని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఏప్రిల్ 19వ తేదీన పెదకాకాని మండలం వెంకటకృష్ణపురంనకు చెందిన అడుసుమల్లి రాజేష్ విద్యుదాఘాతంతో మరణించాడు. వారి కుటుంబానికి రావాల్సినఅన్ని రకాల బెనిఫిట్స్‌ను నాడు 10లక్షల ఆర్థిక సాయాన్ని అప్పట్లో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అందించారు. నేడు వివిధ క్లెయిమ్స్ ద్వారా విద్యుత్ శాఖ నుంచి బాధిత కుటుంబానికి 16.00లక్షలు రూపాయల చెక్కును బాధిత కుటుంబానికి పార్టీ నాయకులతో కలసి పొన్నూరు శాసన సభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకం కింద కుటుంబ సభ్యులలో వారు నిర్ణయించుకున్న వారికి ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు నరేంద్ర కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



డాక్టర్ గిరిధర్ కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వీవీఐటీ అధ్యాపకులు

వీవీఐటీలో ఇంధన రంగంలో అవకాశాలపై సదస్సు

పెదకాకాని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఇంధన రంగంలో అవకాశాలపై మంగళవారం సదస్సు నిర్వహించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించేందుకు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ఈ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యవక్తగా సీమెన్స్ ఎనర్జీ ఇండస్ట్రియల్ టర్బో మెషనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇంజనీరింగ్ (గ్యాస్ టర్బైన్స్) హెడ్ డాక్టర్ గిరిధర్ కుమార్ దిన్నే హాజరయ్యారు. గిరిధర్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పురోగమనాలు, ప్రపంచ పర్యావరణ ఆందోళన కారణంగా ఇంధనరంగం గణనీయమైన మార్పులకు లోనవుతోందని, ఫలితంగా ఇంధన పరిశ్రమలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సంప్రదాయ, సంప్రదాయేతర శక్తి ఉత్పత్తి, వాడుక, ఇంధన శక్తి అన్వేషణ, వెలికితీత, శుద్ధి, ఇంధన సరఫరా, నిల్వ అంశాలను వివరించారు. గ్యాస్ టర్బైన్ వ్యవస్థ నిర్వహణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. మల్లికార్జున రెడ్డి, డైరెక్టర్ రావెల నవీస్, మెకానికల్ విభాగాధిపతి టి.శ్రీనివాసరావు ఈఈఈ విభాగాధిపతి ఏవీ నరేష్‌బాబు అధ్యాపకులు పాల్గొన్నారు.



శాంథోం కరుణ నిలయంలో నిత్యావసరాలను అందజేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ చైర్మన్ ప్రేమలత, సభ్యులు

అనాథలకు ఇన్నర్‌వీల్ క్లబ్ నిత్యావసరాల అందజేత

పొన్నూరు టౌన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నిడుబ్రోలులోని శాంథోం కరుణ నిలయంలో అనాథలకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ మామిడిపూడి ప్రేమలత మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా సమాజ సేవలో భాగస్వామ్యం అవుతున్నామని తెలిపారు. క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా విశిష్ట సేవా వ్యక్తులను సత్కరించారు. కార్యక్రమంలో సుభాషిణి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

తెనాలి రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాలికలు విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కళాజాత ప్రదర్శన ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని 29వ వార్డులోని స్కూల్‌లో బేటీ బచావో - బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా కళాజాతర ప్రదర్శన ఎం.దుర్గాప్రసాద్, ఎం.శివకుమార్‌లు నిర్వహించారు. స్త్రీ విద్య, మహిళాసంరక్షణ చట్టాలు, బాల్య వివాహాల మీద విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ నాటకం వేశారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, వార్డు మహిళా కార్యదర్శి ఏఎన్ఎం, ఆషా కార్యకర్తలు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

9న జాబ్‌మేళా

గుంటూరు (విద్య), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న గుంటూరు, తెనాలిలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొండా సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాలలో, తెనాలిలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఇఇ కార్యాలయం ఆవరణ కెడబ్ల్యు డివిజన్ ఇరిగేషన్ కార్యాలయంలో జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు. జాబ్‌మేళాకు పది, ఐటీఐ, ఇంటర్,డిగ్రీ, బిటెక్, బిఫార్మశీ, పీజీ పూర్తిచేసిన ఎవరైనా అర్హులన్నారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.